నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 20-3-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 201 పేజీలు: 4 వెల: రూ.1/-

రాజ్యసభ సభ్యునిగా రంజన్‌గొగోయ్ ప్రమాణం

నిరసనగా విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ,మార్చి19(ఆర్ఎన్ఎ): మాజీ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ గురువారం రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే చైర్ వద్దకు గొగోయ్ చేరుకోగానే విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు.గొగోయ్ ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో కొందరు ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. గొగోయ్‌ను ఎంపీగా ప్రమాణం చేయనీయవద్దు అంటూ కొందరు చైర్మన్ వెంకయ్యను వేడుకున్నారు. అయితే ఆ సమయంలో కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించారు. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారమే గొగోయ్‌ను రాజ్యసభకు ఎంపిక చేసినట్లు రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు రాజ్యసభకు వచ్చే సాంప్రదాయం ఉన్నదని, మాజీ సీజే గొగోయ్ కూడా దేశ సేవకు తన వంతు సాయం అందిస్తారని ఆశిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గొగోయ్ ప్రమాణ స్వీకార సమయంలో విపక్షాలు వాకౌట్ చేయడం సరైందికాదన్నారు. ఇలా ఓ సభ్యుడిని అవమానించడం విపక్షాలకు తగదన్నారు. అయితే గొగోయ్ ప్రమాణం సందర్భంగా జరిగిన నిరసనలు ఏవీ రికార్డులకు పోవని ఛైర్మన్ వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు.

ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా మృతులు

వైరస్‌తో ఇప్పటి వరకు 8978 మంది మరణం

2 లక్షల 19 వేల 548 మందికి కరోనా

భారత్‌లో 175 మందికి కరోనా పాజిటివ్

పలు రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ,మార్చి19(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్‌తో ఇప్పటి వరకు 8978మంది మరణించారు. ప్రపంచ వ్యాప్తంగా 2 లక్షల 19 వేల 548 మందికి కరోనా సోకినట్టు సమాచారం. కరోనాతో చైనాలో 3245, ఇటలీలో 2978, ఇరాన్ 1135, స్పెయిన్‌లో 638, అమెరికాలో 155, ఫ్రాన్స్‌లో 264, యుకెలో 104, స్విట్జర్లాండ్ 33, జపాన్ దేశాలలో 33 మంది మృతి చెందారు. భారత్‌లో 175 మంది కోవిడ్ 19 సోకగా ఇప్పటి వరకు కరోనాతో ముగ్గురు చనిపోయారు. ఇతర దేశాలలో ఉన్న భారత పౌరులకు 276 మందికి కరోనా వైరస్ సోకగా ఒక ఇరాన్‌లోని 255 మంది సోకినట్టు సమాచారం. ఇక మనదేశంలో కరోనా వైరస్ ప్రభావం రైల్వేశాఖ మీద కూడా పడింది. దేశంలో నిత్యం లక్షలాది మంది రైళ్లలో ప్రయాణిస్తుంటారు. దీంతో, వైరస్ వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యగా రైల్వేశాఖ అధికారులు 168 రైళ్లను రద్దు చేశారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా మార్చి 20 నుంచి 31 వరకు రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ముందస్తుగా టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు వ్యక్తిగతంగా సమాచారం అందిస్తామని రైల్వేశాఖ ప్రకటించింది. మరోవైపు భారత్‌లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 175కి చేరుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. దేశంలో కరోనా ప్రబలుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సామాజిక దూరాన్ని పాటిస్తూ వ్యక్తిగత నిర్బంధంలో ఉంటున్నారు. ముంబై చిత్ర పరిశ్రమ సైతం ఈ నెల 31 వరకు అన్ని షూటింగ్స్‌ను రద్దు చేసుకుంది. చాలామంది బాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా ద్వారా తమ అభిమానులకు సందేశాలను ఇస్తూ జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచిస్తు న్నారు. ఈ క్రమంలో భాగంగా ప్రముఖ నటి ఆలియా భట్ ఇన్‌స్టాగ్రాంలో పుస్తకాన్ని చదువుతున్న ఓ ఫోటోను షేర్ చేశారు. ఇంటి వద్దే ఉండండి.. ఓ పుస్తకాన్ని పూర్తి చేయండి అంటూ క్యాప్షన్‌ను జోడించింది. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ఆలియా ప్రస్తుతం నటిస్తున్న చిత్రం గంగూబాయి కతియావాడి షూటింగ్ ఆగిపోయింది. అదేవిధంగా అయాన్ ముఖర్జీ మూవీ బ్రహ్మాస్త్రాలో రణబీర్ కపూర్‌కు జోడిగా నటిస్తోంది. ఇలా ఈ ఏడాది పలు ప్రాజెక్టులు ఆమె చేతిలో ఉన్నాయి. ఒక్క ఆలియా భట్ మాత్రమే కాకుండా మిగతా బాలీవుడ్ స్టార్స్ సైతం ఇంట్లో ఏ విధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నది తమ అభిమానులతో పంచుకుంటున్నారు. కరీనా కపూర్ ఖాన్, సైఫ్ అలీఖాన్, ట్వింకిల్‌ఖన్నా, అక్షయ్ కుమార్ ఇలా పలువురు బాలీవుడ్ స్టార్స్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో టచ్‌లో ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకునే అంశాలను పంచుకుంటున్నారు.

కరోనా పేషెంట్ల బట్టులు ఉతకరట

దేశంలో అత్యధిక కోవిడ్-19 కేసులు నమోదైన మహారాష్ట్రలో కరోనా పేషెంట్ల బట్టలు ఉతకడానికి ధోబీలు ససేమిరా అంటున్నారు. తమకూ ఆ వైరస్ సోకుతుందేమోనన్న భయంతో వెనకడుగు వేస్తున్నారు. సాధారణంగా ఆసుపత్రిలోని వివిధ వార్డుల్లో వినియోగించే వస్త్రాలను స్థానికంగా పనిచేసే ధోబీలతో ఉతికిస్తారు. అదే విధంగా మహారాష్ట్రలోని యవత్మల్ స్థానిక ఆసుపత్రిలో సోమవారం అన్ని వార్డులతో పాటు ఐసోలేషన్ వార్డులో వినియోగించిన బెడ్ షీట్లు, కర్టెన్లు, పేషెంట్ల వస్త్రాలను ఉతకమని ధోబీలకు అందించారు. కానీ వారు తాము ఆ పని చేయలేమంటూ చేతులెత్తేశారు. ఐసోలేషన్ వార్డులో ఉపయోగిం చిన బట్టలు ముట్టుకుంటే తమకు ఆ వైరస్ సోకుతుందేమోనని భయంగా ఉందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అశోక్ చౌదరి అనే వ్యక్తి పేర్కొన్నాడు. కాగా కరోనా అనుమానితులను, వ్యాధిగ్రస్తులను ఐసోలేషన్ వార్డులకు తరలించి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే.

మహారాష్ట్రలో నిలిచిపోయిన డబ్బావాలా సేవలు

మహారాష్ట్రలో డబ్బావాలాలు తమ సేవలను నిలిపేశారు. మార్చి 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సేవలను రద్దు చేస్తున్నట్లు డబ్బావాలాలు పేర్కొన్నారు. మహారాష్ట్రలో అత్యధిక సంఖ్యలో కేసులు నమోదు కావడం వల్ల ఆ రాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే కూడా కొన్ని సూచనలు చేశారు. ప్రజలు ప్రయాణాలను రద్దు చేసుకోవాలన్నారు. కరోనాతో యుద్ధం చేస్తున్నామని, ప్రస్తుతం పరిస్థితి క్లిష్టంగా లేకున్నా.. ఆందోళనకరంగా ఉందన్నారు.

కరోనా పరుపుల పేర ప్రచారం

షాపులోని పరుపులు కొని వినియోగిస్తే కరోనా నివారణ అవుతుందని తప్పుడు ప్రకటన చేసిన భివాండీ లోని ఫర్నిచర్ షాపు యజమానిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ షాపు యజమాని పేరు పోలీసులు చెప్పడం లేదు. ఈ షాపు యజమానికి రెండు ఫర్నీచర్ షోరూమ్‌లున్నాయి. తాను షాపులో ప్రత్యేకమైన పరుపులు అమ్ముతున్నానని, వాటిపై నిద్రిస్తే కరోనా నయం కావడం కానీ రాకుండా నియంత్రణ కావడం కానీ జరుగుతుందని వివరిస్తూ గుజరాతీ వార్తా పత్రికలో మార్చి 13న ప్రకటన ఇచ్చాడు. దీనిపై ఖర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజ్‌కుమార్ షిండే చెప్పారు. ప్రకటన ప్రకారం నిందితుడు ఎలాంటి రుజువు చూపించలేదని ఆయన తెలిపారు.

ఎండలో గడవండి.. కరోనా చనిపోతుంది

ప్రజలు కనీసం 15 నిమిషాల పాటు ఎండలో గడపాలని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి అశ్విని కుమార్ చౌబే సూచన చేశారు. గురువారం ఆయన పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సూర్యరశ్మిలో ఉండడం వల్ల విటమిన్ డి లభిస్తుందని, దాని వల్ల ఇమ్యూనిటీ పెరుగుతందని, దాని వల్ల నోవెల్ కరోనా లాంటి వైరస్‌లు కూడా చనిపోతాయని మంత్రి తెలిపారు.

టెన్త్ పరీక్షలు ప్రారంభంకావడంతో మాస్కులు ధరించి వచ్చిన విద్యార్థులు

ప్రారంభమైన టెన్త్ పరీక్షలు

మాస్కులతో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): కరోనా భయం ప్రతి ఒక్కరిని పట్టిపీడిస్తోందనడానికి పది పరీక్షల తీరు తెలియచేస్తోంది. గురువారం రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. కరోనా మహమ్మారి వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా స్వీయ నిర్బంధంలో ఉంటున్నారు. రాష్ట్రంలో కరోనా వైరస్(కోవిడ్-19) పాజిటివ్ కేసులు అధికమవుతుండడంతో ప్రభుత్వం ఇప్పటికే ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను అప్రమత్తం చేసింది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పరీక్షా కేంద్రానికి హాజరయ్యారు. వారికి తల్లిదండ్రులు కూడా బాసటగా నిలుస్తూ.. పరీక్షా కేంద్రాల వద్దకు వచ్చి, భరోసానిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యార్థులు మాస్కులు ధరించి పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు శానిటైజర్లు, నీళ్ల బాటిల్స్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఇప్పటికే విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అయితే పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఆ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తమ బిడ్డలకు కరోనా సోకొద్దనే ఉద్దేశంతో వారికి పలు సూచనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెంటర్ల వద్ద మాస్కులతో విద్యార్థులు దర్శనమిస్తున్నారు. విద్యార్థులకు దగ్గరుండి వారి తల్లిదండ్రులు మాస్కులు కట్టి సెంటర్ లోపలికి పంపిస్తున్నారు. కొంతమంది విద్యార్థులైతే తమ చేతులను శుభ్రంగా కడుక్కొని పరీక్షలకు హాజరవుతున్నారు. కరోనా బారిన పడకుండా ఉండేందుకు అన్ని విధాలా అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక ఇన్విజిలేటర్లు కూడా మాస్కులు ధరించి విధులకు హాజరయ్యారు.

కరోనా భయం.. ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య

న్యూఢిల్లీ,మార్చి19(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ తనకు సోకిందనే భయంతో 35 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పంజాబ్‌కు చెందిన ఓ వ్యక్తి సిడ్నీలో గతేడాది నుంచి ఉంటున్నాడు. బుధవారం సిడ్నీ నుంచి ఢిల్లీకి ఎయిరిండియా విమానంలో వచ్చాడు. ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ కాగానే.. ప్రయాణికులందరికీ థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించారు. కొద్ది మందికి కరోనా లక్షణాలు ఉండడంతో అక్కడ్నుంచి నేరుగా సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఐసోలేషన్ వార్డులో ఉంచారు. దీంతో పంజాబ్‌కు చెందిన వ్యక్తి తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. ఆయన రక్త నమూనాలను టెస్టుకు పంపించారు. ఇంతలోనే తనకు కరోనా సోకి ఉండొచ్చనే భయంతో ఆస్పత్రిలోని ఏడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

చరిత్రలో నేటినిజం

కం॥ ధాటిగ మాటాడగలని
పేటిగ యోచనల జేయు మేధోనిధిగా
"నీటెల రాజేందరు"నకు
మాటలనిడి చేసెదను నమస్కారంబుల్!!

(మార్చి 20 ఈటెల రాజేందర్ జన్మదినం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

రైలులో తప్పించుకున్న నలుగురు విదేశీయులు

గుర్తించి పట్టుకున్న టిసి..ఢిల్లీకి తరలింపు

మహారాష్ట్రలో 47కు చేరిన కరోనా కేసులు

బహిరంగంగా ఉమ్మివేతపై నిషేధం

ముంబై,మార్చి19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ విస్తరించకుండా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అయితే కొందరి నిర్లక్ష్యం వల్ల కరోనా మరింత విస్తరిస్తోందని బుధవారం జరిగిన ఓ సంఘటన అందుకు అద్దం పడుతోంది. విదేశాల నుంచి వచ్చిన నలుగురు ముంబై నుంచి గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ వెళుతున్నారు. వారి చేతికి క్వారంటైన్ ముద్ర కూడా ఉంది. అయినప్పటికీ ఎవరి దృష్టి వారిపై పడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. రైలులో విధులు నిర్వహిస్తున్న టీసీ ఈ విషయాన్ని దహాణు స్టేషన్ వద్ద గమనించడంతో సంఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో మేలుకున్న అధికారులు ఆ రైలును పాల్ఘర్ స్టేషన్‌లో ఆపేసి ఆ నలుగురిని దింపివేశారు. జర్మనీ నుంచి వచ్చిన ఆ నలుగురు పాల్ఘర్‌లో వైద్య పరీక్షల కోసం వేచి చూసేందుకు నిరాకరించారు. తాము ఢిల్లీలో స్వగ్రామానికి వెళతామని పట్టుబట్టారు. చివరకు రాష్ట్ర కరోనా కంట్రోల్ రూమ్‌తో సంప్రదించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ తరువాత ఓ ప్రైవేటు వాహనంలో వారిని సూరత్ పంపించినట్లు పాల్ఘర్ జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ దయానంద్ సూర్యవంశీ తెలిపారు. మహారాష్ట్రలో గురువారానికి కరోనా వైరస్ రోగుల సంఖ్య 47కి చేరింది. యూకే నుంచి ముంబై వచ్చిన ఓ యువతికి, అలాగే దుబాయ్ నుంచి వచ్చిన ఓ మహిళకు కరోనా పాజిటివ్ వచ్చింది. మరోవైపు పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా కరోనా వైరస్ పరీక్షలు నిర్వహించడానికి అదనంగా మరో ఎనిమిది ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని ఆరోగ్య శాఖ మంత్రి రాజేశ్ టోపే వెల్లడించారు. అంతేగాకుండా కరోనా వైరస్ విస్తరించకుండా బీఎంసీ కూడా కఠిన చర్యలు తీసుకోనుంది. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టమున్న చోట ఉమ్మివేస్తే ఏకంగా రూ.వేయి జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది. ఇదివరకు రోడ్డుపై ఉమ్మివేస్తే రూ.100 జరిమానా వసూలు చేసేవారు.

ఎటిఎంలో పెట్టాల్సిన డబ్బుతో ఉడాయింపు

నిందితుడిని దొరకబట్టిన పోలీసులు

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): ఏటీఎంల్లో నగదు నింపే ఏజెన్సీని మోసం చేసిన వ్యక్తిని పోలీసులుఅరెస్టు చేశారు. ఎస్‌బీఐ ఏటీఎంల్లో నింపాల్సిన రూ. 90 లక్షలతో నిందితుడు ఉడాయించాడు. నిందితుడిని ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రూ. 90 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్ తెలిపారు. నిందితుడిని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దొండపాటి ప్రకాశ్‌గా గుర్తించామన్నారు. నగదు తీసుకెళ్తున్న వ్యాన్ డ్రైవర్, సెక్యూరిటీ గార్డు దృష్టి మరల్చి రూ. 90 లక్షలను దొంగిలించాడు. దీంతో 16వ తేదీన చిలకలగూడ పోలీసులకు డ్రైవర్, సెక్యూరిటీ గార్డు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సుమారు 500 సీసీకెమెరాలను గుర్తించి నిందితుడిని గుర్తించారు. 28 మంది పోలీసు అధికారులు ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్నట్లు సీపీ అంజనీ కుమార్ తెలిపారు.

నిర్భయ దోషులకు నేడు ఉరితీత

తెల్లారేసరికి ఉరికొయ్యకు వేలాడనున్న దేహాలు

చివరి పిటిషన్‌ను కూడా తిరస్కరించిన సుప్రీం

న్యూఢిల్లీ,మార్చి19(ఆర్ఎన్ఎ): నిర్భయదోషులకు సంబంధించి దారులు మూసుకుపోయాయి. చివరగా గురువారం సుప్రీం తుది పిటిషన్‌ను కూడా తిరస్కరించింది. జస్టిస్ ఎన్‌వి రమణ నేతృత్వంలోని ధర్మాసనం దోషుల తరపున దాఖలైన పిటిషన్ తిరస్కరించారు. దీంతో ఇక ఉరితీయడమే మిగిలిపోయింది. అయినాచివరి నిముషంలో ఎలాంటి ఆటంకాలు కలగకుంటే..తెల్లారే సరికి నలుగురు నిర్భయదోషుల ప్రాణాలు ఎగిరిపోనున్నయి. వారి దేహాలు ఉరికొయ్యకు వేలాడనున్నాయి. అనేకమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఉరికి ఇక రంగం సిద్ధం అయ్యింది.

శుక్రవారం తెల్లవారు జామున 5.30 గంటలకు నలుగురిని ఒకేసారి తలారి ఉరికొయ్యకు వేలదదీయనున్నారు. ఈ మేరకు తీహార్ జైలు అధికారులు ఏర్పాట్లు కూడా పూర్తిచేశారు. యావద్దేశాన్నీ తీవ్రంగా కుదిపేసిన నిర్భయ హత్యాచారం కేసులో ఉరిశిక్ష పడిన నలుగురు దోషులను శుక్రవారం తెల్లవారుజామున ఐదున్నరకు ఉరితీయనున్నారు. దీనికోసం తిహార్ జైలు అధికారులు యూపీలోని మీరట్ నుంచి ఇప్పటికే తలారిని రప్పించి ట్రల్స్ కూడా నిర్వహించారు. 2012 డిసెంబరు 16రాత్రి ఢిల్లీలో కదిలే బస్సులో నిర్భయను ఆరుగురు గ్యాంగ్ రేప్ చేసి హత్య చేశారు.

ఈ కేసులో దోషులు ముఖేశ్ సింగ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ, అక్షయ్ సింగ్ ఉరికంబానికి ఎక్కబోతున్నప్పటికీ వారు కోర్టుల్లో ఇంకా న్యాయపోరాటం చేస్తున్నారు. వ్యాజ్యాలమీద వ్యాజ్యాలు వేస్తున్నారు.ఉరిశిక్ష అమలును మరింత జాప్యం చేయడానికి రాజ్యాంగ, న్యాయపరంగా అన్ని మార్గాలూ అన్వేషిస్తున్నారు. క్షమాభిక్షను పునస్సమీక్షించాలని కోరుతూ అక్షయ్, పవన్ రాష్ట్రపతికి మళ్లీ పిటిషన్లు పెట్టుకున్నారని ఆ న్యాయవాది అదనపు సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రాణాకు తెలిపారు. దీనిపై గురువారం విచారణ జరుపుతామని జడ్జి ప్రకటించారు. మరో దోషి పవన్ గుప్తా సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్ వేశాడు. హత్యాచారం జరిగినప్పుడు తాను మైనర్‌ని అంటూ గతంలో గుప్తా దాఖలుచేసిన రివ్యూ వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడంతో అతను క్యూరేటివ్ పిటిషన్ వేశాడు. ఇదిలావుండగా, ఘటన జరిగిన రోజున తాను ఢిల్లీలో లేనంటూ ముఖేశ్ సింగ్ దాఖలుచేసిన అప్పీలును ఢిల్లీ హైకోర్టు బుధవారం కొట్టివేసింది.

మరో దోషి అక్షయ్ సింగ్ భార్య బిహార్‌లోని ఒక కోర్టులో విడాకుల కోసం వ్యాజ్యం వేసింది. రేప్ కేసులో తన భర్తను ఉరి తీస్తే ఆ తర్వాత వితంతువుగా ఈ సమాజంలో చెడ్డపేరుతో బతకడం తనకిష్టం లేదని, తనకు విడాకులు ఇప్పించాలని ఆమె కోరింది. నిర్భయ దోషుల ఉరితీతకు ట్రయల్ కోర్టు ఇప్పటికే మూడుసార్లు డెత్‌వారెంట్లు ఇచ్చినప్పటికీ, న్యాయపరమైన కారణాలతో అమలు అమలుకాలేదు. తాజాగా నాలుగోసారి కోర్టు ఇచ్చిన డెత్ వారెంట్లు కూడా ఇవే కారణాలతో మళ్లీ నిలిచిపోయే అవకాశం ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు మీరట్ నుంచి వచ్చిన తలారి పవన్ జల్లాద్ బుధవారం తిహార్ జైల్లో అధికారుల సమక్షంలో డమ్మీ ఉరితీతను అమలుచేశాడు. ఇకపోతే పదేపదే ఉరితీతను అడ్డుకోవడంపై నిర్భయతల్లి ఆశాదేవీ అసహనం వ్యక్తం చేసింది.

ఇచ్చిన హామీని నిలుపుకున్న సిఎం కెసిఆర్

రైతురుణాలకు నిధుల విడుదల చేసి చిత్తశుద్ధి చాటారు

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి,మార్చి19(ఆర్ఎన్ఎ): రైతులకు ఇచ్ఇన హామీ మేరకు రుణమాఫీ కార్యక్రమం జరుగబోతున్నదని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే మార్గదర్శకాలతో పాటు, నిధులు కూడా విడుదల చేశారని అన్నారు. సిఎం కెసిఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు కార్యక్రమం సాగనుందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యం గా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. చిరైతు సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం పని చేస్తున్నదని, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కిందని పేర్కొన్నారు. రైతు సమస్యలను పరిష్కరించడంతోపాటు గోదాం నిర్మాణం,తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎటు చూసినా పచ్చదనంతో ఉండేలా చెట్లను పెంచుకోవాలనీ, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మనోహర్‌రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాలాభివృద్ధి కోసం ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం పెంపొందించేందుకు హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించు కునేందుకు ట్రాక్టర్లను వినియోగించాలన్నారు. గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేందుకు ట్రాక్టర్లను వాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కరోనా నేపథ్యంలో గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూనే తమ వీధులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కరోనాను సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్లపై పోలీస్ నజర్

హైదరాబాద్, మార్చి19:శవాన్ని కూడా సొమ్ము చేసుకునే కక్కుర్తిగాళ్లు మన చుట్టూ చాలా మందే ఉంటారు. కరోనా వైరస్‌ను అడ్డం పెట్టుకుని కొంత మంది డబ్బులు సంపాదిస్తున్నారు. నకిలీ శానిటైజర్లు తయారు చేయడం, మాస్క్‌లు, శానిటైజర్లను ఎక్కురేట్లకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి వారిపై ఇప్పుడు హైదరాబాద్ పోలీసులు దృష్టి సారించారు.

ఇళ్లలోనే ఇష్టమొచ్చినట్లు రకరకాల లిక్విడ్లు కలిపేసి... విదేశీ బ్రాండ్ల లేబుళ్లు తగిలించేసి... అమాయక ప్రజలకు అమ్మి... అడ్డగోలుగా డబ్బు సంపాదించుకుంటున్నారు. ఇలాంటి శానిటైజర్లను ఎంత రేటు పెట్టి కొనుక్కున్నా వేస్టే... ఇవి వైరస్‌ని చంపలేవు సరికదా... వీటిపై నమ్మకం పెట్టుకుంటే... వైరస్ సోకే ప్రమాదం ఉంటుంది. అందువల్ల నకిలీ హ్యాండ్ శానిటైజర్లు ఎవరు ఎక్కడ అమ్ముతున్నా దేశవ్యాప్తంగా అడ్డుకుంటున్నారు పోలీసులు.

హైదరాబాద్‌లోని పలు చోట్ల మంగళవారం రాచకొండ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బ్రాండెడ్ పేర్లతో నకిలీ శానిటైజర్లు తయారు చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేశారు. రాచకొండ పోలీస్ ప్రత్యేక బృందాలు ఒకేసారి వేర్వేరు చోట్ల దాడులు నిర్వహించి నకిలీ శానిటైజర్ నిల్వలను సీజ్ చేశారు. ఎక్కడైనా ఎవరైనా ఇలాంటి నకిలీ శానిటైజర్లు, మాస్క్‌లు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ కోరారు. కరోనాను సొమ్ము చేసుకుంటున్న ఎటువంటి వారినైనా వదలమని ఆయన చెప్పారు.

కోయంబత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఐదురుగు విద్యార్థుల దుర్మరణం

కోయంబత్తూర్,మార్చి19(ఆర్ఎన్ఎ): తమిళనాడు తిరుపూరు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. లారీ- కారు ఢీకొని జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు పారమెడికల్ విద్యార్థులు మృతి చెందాగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కథనం ప్రకారం.. ఏడుగురు విద్యార్థుల బృందం తెల్లవారుజామున 3 గంటలకు దాని పర్వత శ్రేణులకు ప్రసిద్ధి చెందిన నీలగిరికి ప్రయాణం అయ్యారు. సేలంలో వీరు చదువుతున్న ఇన్స్టిట్యూట్ కరోనావైరస్ మహమ్మారి కారణంగా తరగతులను నిలిపివేసింది. కోయంబత్తూర్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న అవన్ని ప్రాంతానికి సమీపంలో ఉదయం 6 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. విద్యార్థులు ప్రయాణిస్తున్న వాహనం ఆంధ్రప్రదేశ్ నుంచి కోయంబత్తూరుకు వెళ్తున్న లారీలోకి దూసుకెళ్లింది. స్థానికుల సమాచారంతో కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

వినియోగదారులూ...జాగ్రత్త..!

నేటినిజం
శుక్రవారం 20-3-2020

ఆదా చేద్దాం అనేది సగటు మనిషి వాడే పదం. ఏమాత్రం అవకాశం వచ్చినా డబ్బును దాచేందుకు పరితపించడం మనం గమనిస్తూనే ఉంటాది. కానీ ఒక పెద్ద ఆదా విషయంలో మాత్రం మినహాయింపు ఇవ్వడం జరుగుతోంది. అదే సిగరెట్టు, గుట్కా విషయాలలో ఆదాని ఎందుకు మరిచిపోతున్నారో అర్థం కాని స్థితి నేడు నెలకొంది. ఈ రెండు దురలవాట్లపై చేసే వ్యయం వాటివల్ల వచ్చే వ్యాధుల చికిత్సకు చేసే ఖర్చు 30 ఏళ్ళలో కాలంలో సుమారు 52 లక్షల వరకు ఉంటుందని ఓ పత్రిక నిర్వహించిన సర్వేలో పేర్కొంది. అయితే కొందరికి సరదా. మరికొందరికి అలవాటు. మరి కొందరికి ఓ ఫ్యాషన్ పేరేదయినా వదల లేని వ్యసనంగా మారిన దుర్వ్యసనాలు చివరికి ప్రాణాలనే హరిస్తున్నాయి. పొగ తాగటం అనేది కేవలం ఉత్తేజం కోసమని కొందరంటే మానసిక అలసటను తగ్గించుకోవడం కోసం అని మరికొందరు ఆకతాయి మూకల విశ్లేషణతో తమ జేబుకే కాదు ఏకంగా తమ జీవితానికే చిల్లు పెట్టుకుంటున్నారు. పొగ తాగడం వలన వచ్చే అనర్థాలపై ఒక పత్రిక ఇటీవల నిర్వహించిన సర్వే పలు ఆసక్తికరమయిన విషయాలు వెల్లడించింది. తాగటం ప్రారంభించిన 30 ఏళ్లలో వాటికయ్యే ఖర్చు, వాటివల్ల వచ్చే అనర్థాల బారినుండి బయటపడేందుకు పెట్టే వ్యయం కలిపి దాదాపు 52 లక్షలు ఖర్చు అవుతారని లెక్క తేలింది. అందులో ఆశ్చర్యమున్నా ఆ సంగతి అలా ఉంచితే పొగ తాగే అలవాటు వలన జీవితం ఎలా ఖర్చు అవుతుందో సర్వే పేర్కొంది. పొగతాగటం గుట్కా నమలటం వంటి దురలవాట్లు వ్యక్తి ఆర్థిక స్థితికి పెద్ద చిల్లు పెడతాయి. మనలో లైట్‌గా స్మోక్ చేసేవారయితే రోజుకు 5 సిగరెట్లు తాగుతారు.

మీ సంపాదనలో ఏడాదికి వదివేల రూపాయలు హరించుకుపోతున్నాయి. అదే గుట్కా తాగడానికి అలవాటు పడితే ఏడాదికి ఏడువేలు ఖర్చవుతుంది. పొగాకులో నికోటిన్ విషపదార్థం ఉంటుంది. అది కొవ్వులో కరిగి రక్త పరఫరాపై ప్రభావం చూపుతుంది. నికోటిన్‌కు మనసును అమితంగా తొందరగా ప్రభావితం చేస్తుంది. గుండె సంబంధ మయిన వ్యాధులతో పాటు కాన్సర్, నోటి, గొంతు, స్వరపేటిక, అన్నవాహిక, మూత్రపిండాల క్యాన్సర్, మహాదమని వాపు, రక్తం గడ్డ కట్టడం,గుండె పోటుక పొగ కారణమవుతుంది. గుట్కా పాన్ పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ తో పాటు అధిక రక్తపోటు, గుండెపోటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సాధారణ వ్యక్తికన్నా ఈ దురలవాట్లు ఉన్న వ్యక్తులు ఎక్కువ జబ్బున పడతారు. పలుమార్లు వైద్య పరీక్షలు చేయించుకోవల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఈ ధూమపానం అలవాట్లు ఉన్నవారు ఉద్యోగ భద్రత ఏమాత్రం ఉండదు. సొంతంగా వ్యాపారాలు చేస్తున్న పొగరాయుళ్ళు అనారోగ్యాలబారిన పడి పని వత్తడిని తట్టుకునే శక్తిని కోల్పోతారు. క్రమంగా వ్యాపారం దెబ్బతింటుంది. దాంతో ఉద్యోగంలో చేరడంతో అక్కడ ఏకాగ్రత లేకుంటే తీసి వేస్తారు. ఆ విధంగా ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది. కనుక పొగాకు వినియోగదారులూ తస్మాత్ జాగ్రత్త!

రానున్నది మరింత గడ్డుకాలం

హైదరాబాద్, మార్చి 19:కరోనా ప్రభావం ఎంతకాలం ఉంటుందన్న దానికి సమాధానం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ వ్యాప్తి తీవ్రంగా ఉంది. ప్రపంచ దేశాల మధ్య రాకపోకలు ఇప్పటికే స్తంభించాయి. కొన్ని దేశాలు పట్టణాల మధ్యరాకపోకలను కూడా నిషేధించాయి. అంతర్గత విమాన సర్వీసులను రద్దు చేశాయి. అంతర్జాతీయ విమానాశ్రయాలన్నీ జనాలు లేక బోసిపోతున్నాయి. చైనాలో వైరస్ కట్టడి అయ్యిందని చెబుతున్నా వాస్తవాలను ఆ దేశం దాచిపెడుతోందన్న అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ప్రపంచమంతా వైరస్ విస్తరిస్తోంటే తమదేశంలో మాత్రం కొత్త కేసులు నమోదు కాలేదంటూ డ్రాగన్ బుకాయిస్తోందన్న అనుమా నాలు కలుగుతున్నాయి. ప్రపంచం స్తంభించిన కారణంగా ఉత్పత్తి పడిపోవడం, వస్తు వినియోగం పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా భారత్ లాంటి దేశాలు అతలాకుతలం అవుతాయ. పాకిస్తాన్ లాంటి దేశాలు అయితే తట్టుకోవడం కష్టం అని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పేర్కొనడం చూస్తుంటే ఎంత దౌర్భాగ్య పరిస్థితి ఉందో తెలుసుకోవచ్చు. ఇక విదేశాల నుంచి వస్తున్న వారి కారణంగానే మనదేశంలో కరోనా పీడితుల సంఖ్య పెరుగుతోంది. కరోనా తీవ్రత కారణంగా మార్కెట్ల పతనం కొనసాగుతోంది. అయినా డాలర్‌తో రూపాయి మారకం విలువ మాత్రం తగ్గడం లేదు సరికదా..75 రూపాయలను దాటింది. ఇది కూడా మన ఆర్థిక వ్యవస్థకు భారంగానే చూడాలి. ఇప్పటికే వ్యాపార, వాణిజ్యాలు మొత్తం దెబ్బతిన్నాయి. చిరు వ్యాపారుల చితికి పోతున్నారు. ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. రానున్న రోజుల్లో పెట్రోల్,డీజిల్ దురుకుతుందా లేదా అన్న భయాందోళనలో ప్రజలు ఉన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు కొనుగోళ్లు చేస్తున్నారు. కరోనా కారణంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించిందంటూ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ప్రకటన చేసింది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు తీవ్రరూపం దాల్చాయి. అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలు కాగా మన మార్కెట్లు సైతం అదే బాటలో నడిచాయి.ఆసియా పసిఫిక్ వృద్ధి 2020లో సగానికి సగం తగ్గి 3శాతం లోపునకు పడిపోవచ్చన్న అంచనాలను ఎస్‌అండ్‌పీ విడుదల చేసింది. అంతర్జాతీయంగా ఈక్విటీ, చమురు మార్కెట్లు కుప్పకూలాయి. ఎన్ని ఉద్దీపనలు ప్రకటించినా కానీ, కరోనా ప్రతాపంతో ప్రపంచ వృద్ధి రేటు దారుణంగా పడిపోవచ్చన్న భయాలతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు పోటీపడ్డారు. యూరోప్ మార్కెట్లు లండన్, ప్యారిస్, ఫ్రాంక్‌ఫర్ట్ ఐదు శాతం పడిపోగా, ఆసియా మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. షాంఘై, హాంకాంగ్, సియోల్, జపాన్ 5 శాతం వరకు నష్టపోయాయి. ప్యారిస్‌లో అయితే ఒక నెల పాటు షార్ట్ సెల్లింగ్‌ను నిషేధించారు. అలాగే ఒక రోజు పాటు ట్రేడింగ్‌ను కూడా నిలిపివేశారు. అమెరికాలో ఇప్పటికే 300 బిలియన్ డాలర్ల పన్ను చెల్లింపులను వాయిదా వేయగా, ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీని సిద్ధం చేస్తున్నట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్‌ముంచిన్ ప్రకటించారు. అంటే 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం సమయంలో ప్రకటించిన ప్యాకేజీలను ఇది మించిపోనుంది. కరోనాతో అమెరికాలో నిరుద్యోగరేటు 20 శాతానికి పెరిగిపోతుందని ముచిన్ పేర్కొన్నారు.కోవిడ్-19 ప్రభావంతో అంతర్జాతీయ మాంద్యం తప్పదంటూ రేటింగ్ ఏజెన్సీల హెచ్చరికలతో ఆసియా, యరోప్ మార్కెట్లు నష్టపోగా, మన మార్కెట్లు అదే బాట పట్టాయి. అదనంగా సుప్రీంకోర్టు టెలికం కంపెనీలకు ఏజీఆర్ విషయంలో ఎటువంటి ఉపశమనం కల్పించలేదు. దీంతో టెలికం కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంకు స్టాక్స్‌పై ఎక్కువగా ప్రభావం పడింది. భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లను అమ్మకాలకు పురిగొల్పింది. 2020 సంవత్సరంలో భారత జీడీపీ 5.7 శాతం వృద్ధి సాధించొచ్చన్న గత అంచనాలను తాజాగా 5.2 శాతానికి ఎస్‌అండ్‌పీ తగ్గించింది. అలాగే, కరోనా మహమ్మారి కారణంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించినట్టు ప్రకటించింది. ఆసియా-పసిఫిక్ ఆర్థిక వృద్ధి రేటు సగానికన్నా ఎక్కువగా పతనమై, 3శాతం కన్నా దిగువనకు పడిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కరోనా ప్రభావంతో రానున్న రెండు త్రైమాసికాల్లో అంతర్జాతీయ పర్యాటక రంగం కుదేలయ్యే అవకాశం ఉందని పేర్కొన్నది. ఇప్పటికే యూరోప్ నుంచి పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. 2020లో చైనా వృద్ధి రేటును 4.8 శాతం నుంచి 2.9 శాతానికి కుదించింది. వృద్ధి అనేది కరోనా అదుపుపైనే ఆధారపడి ఉందని రేటింగ్ దిగ్గజం అభిప్రాయపడింది. కరోనా ప్రభావం ఉపాధి, ఉద్యోగుల పనిగంటలు, వేతనాల కోతలకు దారితీయవచ్చని పేర్కొంది.కరోనా నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తుం డడం తమ తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది.అతిపెద్ద ఎకానమీలైన జపాన్, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్ పూర్తి ఏడాది మాంద్యంలోకి జారిపోవచ్చని ఈఐయూ పేర్కొంది. మొత్తంగా కరోనా భయాల నేపథ్యంలో పెట్టుబడులకు సంబంధించి అంతర్జాతీయంగా ఇన్వెస్టర్ల భయాందోళనలు కొనసాగుతున్నాయి. ఈక్విటీలతో పాటు బంగారం, క్రూడ్ సహా ప్రతి ఒక్క సాధనం నుంచీ పెట్టుబడులు వెనక్కు మళ్లుతున్నాయి. డాలర్ మాత్రం లాభాల్లో ట్రేడవుతోంది. దీంతో డాలర్ మారకం 75 రూపాయలు దాటింది. మొత్తంగా ఈ వ్యవహారం ఎంతవరకు దారితీస్తుందన్న దానికి సమాధానం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అంతర్జాతీయంగా మనకు క్రూడాయిల్ కూడా దిగుమతి కష్టంగా మారనుంది. దీంతో నిత్యావసర సరుకులు, రవాణకు మరింత గడ్డుకాలం రావచ్చు.

ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు తప్పని పోలింగ్

ఏకగ్రీవానికి అవకాశం లేకుండా పోటీలో అభ్యర్థులు

ఎన్నిక నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు

నిజామాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల నియోజవకర్గ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక అనివార్యం కానుంది. కవితతో పాటు బిజెపి, కాంగ్రెస్ నేతలు కూడా నామినేషన్లు వేయడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. స్థానిక సంస్థల బలం మేరకు టిఆర్ఎస్ గెలుపు సులువే అయినా పోటీ కారణంగా ఎన్నిక నిర్వహణ అనివర్యం అయ్యింది. 20న నామినేషన్ల పరిశీలన, 23న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. ఏప్రిల్ 7న పోలింగ్ ఉంటుంది. ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎప్రిల్ 9న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఓటర్ల జాబితాపై కసరత్తు పూర్తి చేసిన అధికారులు.. ఇక ఎన్నికల పక్రియ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎన్నికను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. రెవెన్యూ డివిజన్‌కు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఆరు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. వీటిల్లో ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థలకు చెందిన ప్రతినిధులైన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎక్స్‌అఫీషియో సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఈ ఎన్నికలో ఓటర్లుగా ఉంటారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులతో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ చింతకుంట నారాయణరెడ్డి ఇప్పటికే సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థలన్నింటిలో ఉన్న ప్రజాప్రతినిధులంతా కలిపి మొత్తం 878 మంది ఉన్నారని లెక్కతేలినట్లు తెలిసింది. వీరంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసుందుకు అర్హులు. ఈ ఓటర్ల జాబితాను పోలింగ్ స్టేషన్ల వారీగా, జడ్పీ కార్యాలయాల్లో, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రదర్శించారు. డాక్టర్ భూపతిరెడ్డిపై అనర్హత వేటు కారణంగా ఎమ్మెల్సీకి ఉప ఎన్నిక అనివార్యమైంది. దాదాపు రెండేండ్ల కాలపరిమితి మాత్రమే ఈ పదవికి ఉన్నది. మొత్తం ఆరేండ్ల కాల పరిమితి గల ఈ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవి టీఆర్ఎస్ అధిష్టానం డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి ఇచ్చింది. కవిత కూడా ఏకగ్రీవంగానే ఎన్నికయ్యే అవకాశం ఉన్నప్పటికీ బిజెపి,కాంగ్రెస్ అభ్యర్థుల పోటీ కారణంగా ఎన్నిక అనివార్యం కానుంది. మొత్తంగా ఇప్పుడు క్రియాశీలక రాజకీయాల్లోకి మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల కవిత పునరాగమనంతో గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నెలకొంది. ఈ ఎన్నిక తరవాత ఇక నిజామాబాద్ జిల్లా రాజకీయం మరోమారు వేడెక్కనుంది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కవిత జిల్లా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. దీంతో ఆమె అనుచరులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. కవితను క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలని అభిలాషించారు. కవిత రావాలంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున పోస్టులు పెట్టారు. శ్రేణులు కోరుకున్నట్లుగానే కవిత జిల్లా క్రియాశీలక రాజకీయాల్లోకి మరోమారు అడుగుపెట్టడంతో ఆమె అనుచరుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నామినేషన్ వేసేందుకు జిల్లాకు వచ్చిన సందర్భంగా కవితకు ఘన స్వాగతం లభించింది.

కవ్వాల్ రక్షణతో పులులకు భరోసా

పెరుగుతున్న జాతీయ జంతువుల సంఖ్య

కఠిన చర్యలతో అడవుల్లో రక్షణ ఏర్పాట్లు

నిర్మల్,మార్చి19(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఏర్పడక ముందు కవ్వాల్ అటవీ ప్రాంతంలో పులులు శాతం చాలా తక్కువ. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మెరుగైన నిర్వహణ పద్ధతులను అవలంబిస్తుండటంతో పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. గతంతో పోలిస్తే.. ప్రస్తుతం అనువైన వాతా వరణం కారణంగా క్రమంగా పులుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు ఫలిస్తున్నాయి. అడవులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఏళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బదిలీ వేటు వేసిన సర్కారు వారి స్థానాల్లో కఠినంగా వ్యవహరించే వారిని నియమించింది. జంగిల్ బచావో? జంగిల్ బడావో'ని నాదంతో అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడుతోంది. సీఎం సీరియస్‌గా ఇచ్చిన ఆదేశాలతో అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంస్కరణలు కొనసాగుతున్నాయి. అడవులతో పాటు ఇప్పుడు పులిని కూడా రక్షించాల్సిన అవసరం గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సీఎఫ్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో అభయారణ్యంలో పలు చర్యలు చేపడుతున్నారు. అభయారణ్యంలోకి పులి రాకకు అడ్డంకులుగా మారుతున్న వాటిపై దృష్టిపెట్టారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలో అభయారణ్యం పరిధిలో ఉన్న రాంపూర్, మైసంపేట్ గ్రామాలను మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇప్పటికే ఈ గ్రామాల పునరావాసం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రంలోని రెండు అభయారణ్యాల్లో ఒకటైన మన కవ్వాల్ పులుల అభయారణ్యంలో వాటి సంఖ్య పెరుగుతున్నట్లు కేంద్రం చెబుతోంది. ప్రతీ నాలుగేళ్లకోసారి కేంద్ర అటవీ శాఖ పరిధిలోని నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ రాష్ట్రాల్లోని పులుల సంఖ్యను లెక్కిస్తుంటుంది. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ప్రకటించిన వివరాల ప్రకారం తెలంగాణలో 26 పులులు ఉన్నట్లు తేలింది. అప్పటి నుంచి పోలిస్తే వీటి సంఖ్య మరింత పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కవ్వాల్ అభయారణ్యంలో 10 లేదా 12 పులులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గతంతో పోలిస్తే పెరిగిన పులులను కాపాడేందుకు చర్యలు చేపడుతున్నానీ చెబుతున్నారు. గత కొన్నేళ్లుగా అడవుల జిల్లాగా పేరుగాంచిన ఉమ్మడి ఆదిలాబాద్‌లో పదుల సంఖ్యలో పులులు వేటగాళ్ల ఉచ్చులకు, స్మగ్లర్ల కుట్రలకు బలయ్యాయి. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాపై దృష్టిపెట్టి అటవీశాఖ ప్రక్షాళన చేపట్టారు. అప్పటి నుంచి కొంతలో కొంత మార్పు కనిపిస్తోంది. వనంతో వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు, జాతీయ పార్కులు, టైగర్ రిజర్వ్‌లు ఇలా అటవీ ప్రాంతాలన్నింటిలో పులులను అంచనా వేసేందుకు 2018 జూన్‌లో ఓ వారంపాటు అధ్యయనం జరిపారు. పులి పాదాల గుర్తులు, అడవుల్లో పెట్టిన కెమెరాలు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం లెక్కించారు. ఏడాది పాటు శాస్త్రీయ సర్వే చేసిన తర్వాత వివరాలు వెల్లడించారు. వాటి ప్రకారం.. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో పులుల సంఖ్య 68 ఉండగా, అప్పుడు తెలంగాణలో 20 ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కవ్వాల్ అభయారణ్యంలో 3 పులులు ఉన్నట్లు అంచనా వేశారు. ప్రస్తుత లెక్కల ప్రకారం కవ్వాల్‌లో 10 నుంచి12వరకు పులులు ఉండొచ్చని అటవీ అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

గతంలో వేటగాళ్ళు,స్మగ్లర్ల కారణంగా పెద్దపులులు ప్రాణాలు కోల్పోయాయి. రెండేళ్లక్రితం వరుసగా కవ్వాల్ అభయారణ్యంలోని పులులను హతమార్చారు. వైల్డ్ లైఫ్ క్రైం సెంట్రల్ టీమ్ సభ్యులు ఇచ్చోడలో పులిచర్మం పట్టుకోవడం అప్పట్లో సంచలనమైంది. ఈ కేసులో కూపీ లాగగా, పెంబి మండలం తాటిగూడకు చెందిన గుగ్లావత్ ప్రకాశ్ అదే మండలంలోని పుల్గంపాండ్రి అడవుల్లో ఆ పులిని చంపినట్లు తేలింది. దాని చర్మాన్ని అమ్మడానికి ప్రయత్నిస్తూ దొరికిపోయాడు. ఆ తర్వాత పాత మంచిర్యాల బీట్‌లో చిరుతను హతమార్చడం, అదే క్రమంలో శివ్వారం బీట్‌లో ఏకంగా రాయల్ బెంగాల్ టైగర్‌ను మట్టుబెట్టడం తీవ్ర సంచలనం సృష్టించింది. కవ్వాల్ అడవుల్లోకి వచ్చిన పులిని వచ్చినట్లే చంపుతుండటంపై సర్కారు సీరియస్ అయ్యింది. వ్వాల్ టైగర్ రిజర్వ్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు అంటే..నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలోకి వస్తోంది. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో భాగంగా ఉండే కొండలు, దట్టమైన అడవులతో ఉంటుంది.

అరకు రైలుకు మరిన్ని విస్టాడోమ్ కోచ్‌లు

-రైల్వేమంత్రికి ఎంపీ విజయసాయిరెడ్డి విజ్ఞప్తి

న్యూఢిల్లీ,మార్చి19(ఆర్ఎన్ఎ): విశాఖపట్నం-అరకులోయ మధ్య నడిచే పర్యాటక రైలుకు అదనంగా ఐదు విస్టాడోమ్ కోచ్‌లను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రైల్వేమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో బుధవారం ప్రత్యేక ప్రస్తావన (స్పెషల్ మెన్షన్) ద్వారా ఆయన ఈ అంశంపై మాట్లాడుతూ.. బీచ్‌లు, గుహలు, జలపాతాలు, ఘాట్‌లతో విశాఖపట్నం జిల్లా పర్యాటకుల స్వర్గధామంగా విరాజిల్లుతోందని అన్నారు. 'తూర్పు కోస్తాకు మణిహారంగా విశాఖ జిల్లా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో పర్యాటకానికి విశేష ఆకర్షణగా నిలిచిన వాటిలో విస్టాడోమ్ కోచ్ ఒకటి. ప్రస్తుతం పర్యాటక రైలుగా పరిగణించే విశాఖపట్నం-అరకు లోయ రైలుకు అనుసంధానించిన ఈ విస్టాడోమ్ కోచ్‌లో ప్రయాణం పట్ల పర్యాటకులు అమితమైన ఆసక్తి చూపుతున్నారు?' ఆయన అన్నారు. తూర్పు కనుమల్లో విస్తరించిన సువిశాలమైన ఆకుపచ్చని అడవులు, లోయలు, టన్నెల్స్ వంటి ప్రకృతి దృశ్యాలను పర్యాటకులు నిలువెత్తు అద్దాల గుండా నలుదిక్కులా వీక్షించే విధంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన విస్టాడోమ్ కోచ్ ప్రారంభించిన రోజు నుంచే పర్యాటకుల నుంచి విశేష ఆదరణ పొందుతున్నట్లు ఆయన చెప్పారు. అమిత ప్రజాదరణ పొందిన విస్టాడోమ్ కోచ్‌కు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడినప్పటికీ రైలులో కేవలం ఒకే ఒక కోచ్ అందుబాటులో ఉండటం పర్యాటకులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందని అన్నారు. 'విస్టాడోమ్ కోచ్‌లో ప్రయాణానికి టిక్కెట్ల కోసం ప్రతి రోజు సుదీర్ఘమైన వెయిటింగ్ లిస్ట్ ఉంటోంది. ఈ నేపథ్యంలో విశాఖపట్నం-అరకులోయ రైలుకు కనీసం మరో అయిదు విస్టాడోమ్ కోచ్‌లను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేసి పర్యాటకుల అవసరాన్ని తీర్చాలి. అదనంగా ఏర్పాటు చేసే విస్టాడోమ్ కోచ్‌ల వలన విశాఖపట్నంలో పర్యాటక రంగానికి మరింత ఊపు ఇచ్చినట్లవుతుంది. అలాగే రైల్వేలకు కూడా దండిగా ఆదాయం లభిస్తుంది' అని విజయసాయిరెడ్డి అన్నారు. ఈ కారణాల దృష్ట్యా అరకు రైలుకు అదనంగా అయిదు విస్టాడోమ్ కోచ్‌ల ఏర్పాటు కోసం తగిన చర్యలు చేపట్టవలసిందిగా రైల్వే మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

కరోనాపై గిరిజనులను చైతన్యం చేయండి

గురుకుల పాఠశాలల్లో తగు చర్యలు తీసుకోవాలి

అధికారులతో సమీక్షలో మంత్రి సత్యవతి ఆదేశాలు

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి కరోనా వైరస్ రాకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని, కోవిడ్- 19 వ్యాధి లక్షణాల పట్ల అవగాహన కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, గురుకుల విద్యాలయాల అధికారులు, ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమభవన్‌లో కరోనాపై మంత్రి సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. గురుకుల పాఠశాలల్లో, ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు తప్ప మిగిలిన వారికి సెలవులిచ్చినందున, ఎక్కువ మంది విద్యార్థులను ఒకే గదిలో ఉంచకుండా, ఎక్కువ గదుల్లో తక్కువ మంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన విద్యా సంస్థల్లో విద్యార్థులకు కరోనా వైరస్ పట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా పటిష్ట నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం శానిటైజర్లు అందుబాటులో ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పై ఎక్కువ శ్రద్ధ పెట్టేలా చూడాలన్నారు. ఐటీడీఏలంటే గిరిజన సమగ్ర వికాస కేంద్రాలుగా బాసిల్లే విధంగా కొత్తగా వచ్చిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. అట్టడుగున ఉండి, అడవుల్లో ఉన్నగిరిజనులకు సేవ చేసే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గిరిజనుల మన్ననలు పొందేలా పనిచేయాలన్నారు. గిరిజనులకు ఉపయోగపడే కుటీర పరిశ్రమలు స్థాపనకు కృషి చేయాలన్నారు. గుడుంబా బాధిత కుటుంబాలకు, వితంతువులకు ఆసరా కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. వాటన్నింటిని లబ్దిదారులకు చేర్చి ప్రభుత్వం వారికోసం చేస్తున్న కృషి అర్థమయ్యేలా ప్రాజెక్టు అధికారుల పనితీరు ఉండాలన్నారు. గిరిజనుల కోసం ఇంకా ఎలాంటి పథకాలు, పనులు చేస్తే వారి వికాసానికి ఉపయోగపడు తాయో కూడా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులుగా ఆలోచించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లోని నిరక్షరాస్యత నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ గారు చెప్పిన ఈచ్ వన్ టీచ్ వన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా జడ్ చోంగ్తు, ఉట్నూరు ఐటీడీఏ పి.ఓ భవేష్ మిశ్రా, భద్రాచాలం ఐటీడీఏ పి.ఓ గౌతమ్, ఏటూరు నాగారం ఐటీడీఏ పి.ఓ హన్మంతు, మన్ననూరు ఐటీడీఏ పి.ఓ అఖిలేశ్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ మురళికృష్ణ, ట్రైకార్ డిజిఎం శంకర్ రావు, జాయింట్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు విజయలక్ష్మి, నరోత్తమ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ రోడ్డు పనులకు ప్రతిపాదనలు

అభివృద్ధి పనులపై తక్షణ కార్యాచరణ

అధికారులతో సమీక్షించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను మున్సిపల్‌శాఖ మంత్రి కె. తారక రామారావు అధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌పార్లమెంట్ పరిధిలో జీహెచ్ఎంసి చేపట్టిన పనులను వేగంగా పూర్తిచేయాలని కూడా మంత్రి కేటీఆర్ ఆదేశించారు. బుధవారం జీహెచ్ఎంసి కార్యాలయంలో ఎస్ఆర్‌డిపి కింద మంజూరైన ఫ్లయ్‌ఓవర్లు, అండర్ పాస్‌లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణ

గిరిజన సంక్షేమానికి చర్యలు: కలెక్టర్

నిర్మల్,మార్చి19(ఆర్ఎన్ఎ): గిరిజన అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని నిర్మల్ జిల్లా కలెక్టర్ అన్నారు. పీటీజీల అభివృద్ధికి ఐటీడీఏ ఆధ్వర్యంలో సీసీడీపీ నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. 58 సంవత్సరాలు నిండిన గిరిజన కళాకారులను పింఛన్ సౌకర్యం ఉందని, లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు.ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన గ్రామాల్లో డ్రాపౌట్లు లేకుండా డైరెక్టర్లు సహకరించాలన్నారు. అలాంటి పిల్లలను నేరుగా పాఠశాలలో చేర్పించాలన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా డైరెక్టర్లు సహకరించాలన్నారు. ఇందిరజల ప్రభ పథకం ద్వారా గిరిజన వ్యవసాయ భూములను అభివృద్ధిపర్చేందుకు వ్యవసాయ బోరుబావులు, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఉపాధ్యాయులు లేని చోట సర్దుబాటుచేయాలని కలెక్టర్ డీడీని ఆదేశించారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. అత్యవసర సమయాలలో ఉన్న వ్యక్తులకు నేరుగా జిల్లా కేంద్రానికి తరలించాలని ఏజెన్సీ వైద్యాధికారికి సూచించారు.

భవిష్యత్‌లో పారిశ్రామిక హబ్‌గా సిద్దిపేట

-పరిశ్రమల రాకతో నిరుద్యోగులకు అవకాశాలు:ఎమ్మెల్యే

సిద్దిపేట,మార్చి19(ఆర్ఎన్ఎ): రైతులు పండించే పంటల ఆధారంగా వ్యవసాయాధారిత పరిశ్రమలు తీసుకురావడానికి మంత్రి తన్నీరు హరీశ్‌రావు కృషి చేస్తున్నట్లు దుబ ÷-బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి స్పష్టం చేశారు. జిల్లాను పారిశ్రామిక, సాగునీటి రంగాల్లో అభివృద్ధి పరిచాలన్నదే తమ సంకల్పమని అన్నారు. ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మిట్టపల్లి, మందపల్లి గ్రామాల శివారుల మధ్యన 300 ఎకరాల్లో ఆగ్రో బేస్‌డ్ ఇండస్ట్రీ పరిశ్రమను నెలకొల్పనున్నట్లు తెలిపారు. మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలు రావాలంటే ముఖ్యంగా భూసేకరణ, నీళ్లు, కరెంట్, రైల్వే లైన్ అవసరమవుతుందని అన్నారు. త్వరలోనే రైల్వేస్టేషన్ కూడా ఏర్పాటు కానున్న నేపథ్యంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో పారిశ్రామిక హబ్‌గా సిద్దిపేట జిల్లా వేదిక కానుందన్నారు. నంగునూరు మండలం నర్మెటలో 140 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరైందని తెలిపారు. దుద్దెడ వద్ద 100 ఎకరాల్లో మరో పరిశ్రమ ఏర్పాటు కానుందని, ప్రస్తుతం నిర్మాణమవుతున్న కలెక్టరేట్ కార్యాలయం పక్కనే ఐటీ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాతావరణ కాలుష్యం పరిశ్రమలను పెద్దఎత్తున తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రాన్ని నలువైపులా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు తరలివస్తే అన్ని ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఈ గోదావరి జలాలతో బీడు భూములను సస్యశ్యామలం చేస్తామన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మరోవైపు మిషన్ కాకతీయతో చెరువులను పునరుద్ధరించుకుంటున్నామిన అన్నారు. సిద్దిపేట, హన్మకొండ రహదారి వైపు జిల్లా పరిషత్ కార్యాలయం, కోర్టు భవనాలు, రైల్వే స్టేషన్ నిర్మించుకోనున్నట్లు చెప్పారు. ఇకపోతే కరోనా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని రామలింగారెడ్డి సూచించారు.

శ్రీశైలం పాతాళగంగలో స్నానాలు రద్దు

హైదరాబాద్, మార్చి 19: కరోనా ప్రభావం ఇరు తెలుగు రాష్ట్రాల్లోని దేవస్థానాలపై కూడా పడుతున్న విషయం తెలిసిందే. తిరుమల తిరుపతి దేవస్థానంలో గంటకు నాలుగు వేల మంది భక్తులను మాత్రమే స్వామి దర్శనానికి అనుమతిస్తున్నారు. శ్రీశైలం దేవస్థానం సైతం కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలకు ఉపక్రమించింది. నేటి నుంచి శ్రీశైలంలోని పాతళగంగలో భక్తుల పుణ్యస్నానాలను నిలిపివేస్తూ ఆలయ అధికారులు నిర్ణయం వెలువరించారు. అంతేకాకుండా భక్తులు దర్శనానికి రావొద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా వస్తే వారిని స్క్రీనింగ్ చేశాకే ఆలయంలోకి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.

కార్యాలయాల్లో చలివేంద్రాలు తప్పనిసరి

కరోనాపై ప్రజలను చైతన్యం చేయాలి: కలెక్టర్

యాదాద్రి భువనగిరి,మార్చి19(ఆర్ఎన్ఎ): ఎండతీవ్రత పెరగనున్నందున మండలాల్లో ముందస్తు అవగాహన క్యాంపులను నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ అనితారామచంద్రన్ తెలిపారు. మధ్యాహ్న సమయంలో బయటికి రాకుండా ఉదయం పనులు ముగించేవిధంగా వారికి తెలియజేయాలన్నారు. అలాగే ప్రజలకు కరోనాపై అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వం సూచిస్తున్న జాగ్రత్తలను పాటించాలన్నారు. లేకుంటే వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మండలాలలోని ప్రభుత్వ కార్యాలయాలలో తప్పనిసరిగా చలివేంద్రాలు పెట్టాలని తెలిపారు. వివిధ పనులపై వచ్చే వారికి తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. వేసవి కాలం వచ్చినందున జిల్లాలో ఏ ఒక్కరు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఇటుక బట్టీల వద్ద వర్కర్లను ఉదయం పూటనే పని ముగించేవిధంగా సంబంధిత శాఖాధికారి ఆదేశాలు జారీ చేయాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు ఎండతీవ్రత ఉన్న సమయంలో బయట తిరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వయోవృద్ధులు, పిల్లలు మధ్యాహ్న సమయంలో బయట తిరిగితే వడదెబ్బ తగిలే అవకాశాలున్నాయని ప్రత్యేకంగా వీరికి వడదెబ్బ రాకుండా చూసేందుకు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఏ ఒక్కరూ వడదెబ్బకు మృతి చెందినట్లు ఉండకూడదని ముందుగానే ప్రజలకు ఎండతీవ్రతపై వచ్చే ప్రమాదాల గురించి తెలియజేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా పనిప్రాంతాల్లో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జాగ్రత్త తీసుకోవాల్సిన సూచనలతో పాంప్లేట్లు, బ్యానర్లను సిద్ధం చేసి ప్రజలకు పంపిణీ చేయాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది ముందస్తు తమ ట్యాంకులను నీటితో నింపుకొని ఎక్కడ్క ÷ర్ జరిగిన స్పందించి మంటలను ఆర్పేవిధంగా విధి నిర్వహణలో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పొలం పనులకు వెళ్లేవారు కూడా ఉదయమే పనులు ముగించుకోవాలన్నారు.

వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు

జనగామ,మార్చి19(ఆర్ఎన్ఎ): గత హరితహారంలో నాటిన మొక్కలను కాపాడుకుంటూ వచ్చే హరిత హారం కార్యక్రమం కోసం సిద్దంగా ఉండాలని అధికార యంత్రాంగానికి జిల్లా డిఆడిఎ అధికారులు సూచించారు. ఎగువప్రాంత జనగామ జిల్లాలో తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్దంగా ఉండాలని ఆదేశించారు. గతేడాది హరితహారంలో చేపట్టిన మొక్కలు ఎండిపోకుండా కాపాడాలనిఅన్నారు. స్థానిక అధికారులు వాటి రక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొక్కల సంరక్షణ కమిటీలు మండల, డివిజన్ స్థాయిలలో ఉంటాయన్నారు. జాతీయ రహదారి వెంట నాటిన మొక్కల సంరక్షణకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కమిటీలు వేయనున్నామని తెలిపారు. జనగామ జిల్లాలో తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా ఈఏడాది పెద్దఎత్తున మొక్కలు నాటాలని, గతంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకునే దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీఆర్‌డీవో మేకల జయచంద్రారెడ్డికి తగిఆన సూచనలు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నర్సరీల్లో మొక్కల పెంపకానికి అటవీశాఖ, డీఆర్‌డీఏ నర్సరీల్లో మొక్కల వివరాలపై సమీక్షించారు. జిల్లాలో మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రదేశాలను సకాలంలో గుర్తించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదేవిధంగా గృహ నిర్మాణ సంస్థ అధికారులు జిల్లాలో అమలవుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో నిర్దేశించిన గడువులోగా ఇళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

కరీంనగర్‌లో హై అలర్ట్.. కర్ఫ్యూ వాతావరణం

ప్రజలు ఇండ్లకే పరిమితం కావాలి
కలెక్టరేట్‌కు మూడు కి.మీ దూరం నిర్మానుష్యం
రంగంలోకి దిగిన మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్,మార్చి19(నేటినిజం ప్రతినిధి):: కరీంనగర్ ప్రాంతాల్లో అధికారులు హై అలర్ట్ ను ప్రకటించారు. ఇటీవల కరీంనగర్‌లో ఇండోనేషియా వాసులు సంచరించారు. వీరిలో ఏడుగురికి కరోనా పాజిటివ్ ఉంది. దీంతో అక్కడి జనం హడలెత్తి పోతున్నారు. ఇండోనేషియా వాసులు ఎక్కడెక్కడికి వెళ్లారు అనే విషయాలపై పోలీసులు, అధికారులు విచారణ చేపట్టారు. కరీంనగర్‌లోని కలెక్టరేట్ ప్రధాన రహదారి వద్ద, కొన్ని ప్రాంతాల్లోనూ అన్ని దుకాణాలను పోలీసులు మూయించారు. దాదాపుగా 100 వైద్య బృందాలను కూడా కరీంనగర్ ప్రాంతాలకు పంపినట్లు తెలుస్తోంది. 10 మంది ఇండోనేషియా వాసులు కరీంనగర్‌లో పర్యటించారని, వారిలో దాదాపు ఏడుగురికి కరోనా పాజిటివ్ ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వారంతా ఒక మతానికి సంబంధించిన డాక్టర్లుగా గుర్తించామన్నారు. వారంతా అక్కడ 2, 3 ప్రదేశాల్లో తరగతులు నిర్వహించారని తెలుస్తోంది. వారు పర్యటించిన ప్రాంతాలన్నిటినీ పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. సాధారణంగా కరీంనగర్‌కు విదేశాల నుండి ఎక్కువ మంది వస్తుంటారు. ప్రస్తుతం అక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. అత్యవసరమైతేనే తప్ప ఎవ్వరూ బయటకు రాకూడదని అధికారులు ప్రజలకు సూచించారు. కరీంనగర్‌లో కరోనా వైరస్ కలకలం సృష్టించడంతో.. ఆ జిల్లా ప్రజలు ఇండ్లకే పరిమితం కావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇండోనేషియా నుంచి జిల్లా కేంద్రానికి వచ్చిన వారిలో ఏకంగా ఏడుగురికి కరోనా పాజిటివ్ రావడంతో ఆ జిల్లా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ బృందం పర్యటించిన మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్‌లో వంద ప్రత్యేక బృందాలతో ఇంటింటికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ ప్రజలు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కరీంనగర్ ప్రజలు ఇంటికే పరిమితం కావాలని అధికారులు సూచిస్తున్నారు. అవసరమైతే ఆయా ప్రాంతాల్లో నిర్బంధం విధించాలని అధికారులు యోచిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం మంత్రి గంగుల కమలాకర్ పర్యటించారు. ప్రభుత్వ వైద్య సిబ్బందితో పాటు ఆశా వర్కర్లను అప్రమత్తం చేశారు. కరోనా టెస్టులకు సంబంధించి ఆశా వర్కర్లకు వైద్యాధికారులు సూచనలు చేశారు. ఆశా వర్కర్లు అందరూ మాస్కులు ధరించి విధులకు హాజరయ్యారు.

రాష్ట్రమంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలు గుమిగూడే కార్యక్రమాలు రద్దు చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వానికి సహకరించాలని సీఎం కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరోనా నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 13కు చేరింది. నిన్న ఒక్క రోజే 8 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. కలెక్టరేట్‌లో పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్.. కలెక్టర్, శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి, ఇతర అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇండోనేషియా వ్యక్తులు కరీంనగర్‌లో 48 గంటలపాటు ఉన్నట్టు గుర్తించామని.. ఆ సమయంలో సంచరించిన ప్రాంతాలను, కలిసిన వ్యక్తులను గుర్తించామని సమావేశం తర్వాత మంత్రి గంగుల మీడియాకు వెల్లడించారు. కలెక్టరేట్ పరిధిలోని ఓ ప్రార్థనామందిరంలో గడిపినట్టు గుర్తించామని, కలెక్టరేట్ కేంద్రంగా మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రతి ఇంట్లో వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. గురువారం నుంచి వంద వైద్య బృందాలను రంగంలోకి దిం పుతున్నట్టు తెలిపారు. ప్రజలు నాలుగురోజుల పాటు అత్యవసరమైతే తప్ప ఇండ్లనుంచి బయటకు రావద్దని కోరారు. జిల్లాకేంద్రంలో 20 ఐసోలేషన్, 10 ఐసీయూ బెడ్లను ఏర్పాటుచేశామని, రెండు ప్రైవేటు దవాఖానలు ప్రతిమ, చల్మెడ వైద్యశాలల్లో 50 చొప్పున బెడ్స్‌ను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. కరీంనగర్ నగరమంతటా శానిటైజేషన్ చేస్తున్నామని, జనసమూహాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి.. ప్రజలను గుమికూడవద్దని ప్రచారంచేస్తున్నామన్నారు. అత్యవసరంగా చికిత్స అందజేసేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను రంగంలోకి దింపాలని వెల్లడించారు. కరోనా విషయంలో ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం చేపట్టే అన్ని రకాల చర్యలు కేవలం ముందస్తులో భాగమేనని మంత్రి గంగుల పేర్కొన్నారు. కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రజలను కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

తాగునీటి సమస్యపరిష్కారానికే మిషన్ భగీర్థ
జిల్లాలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి : ఇంద్ర

ఆదిలాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): హరితహారం కింద నాటిన మొక్కలు ఈ ఎండాకాలంలో ఎండిపోకుండా అన్ని జిల్లాల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మిషన్ భగీథ కార్యక్రమాన్ని చేపట్టామని, వేసవిలో పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్లతో తాగునీటిని అందిస్తామని మంత్రి అన్నారు.

పజలకు తాగునీటిని అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అన్నారు. సమస్యను పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో మిషన్ భగీరథ వథకానికి రూపకల్పన చేశారన్నారు. రాష్ట్రంలోని ఇంటింటికీ నల్లాల ద్వారా పరిశుభ్రమైన నీటిని ఇవ్వనిదే వచ్చే ఎన్నికల్లో ఓట్లు కూడా అడుగబోమని ప్రకటించిన దమ్ము, ధైర్యం ఉన్న సీఎం కేసీఆర్ అన్నారు.

ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పోచంపాడ్ నుంచి నీటిని తీసుకొచ్చి సరఫరా చేస్తామన్నారు. తాగునీటికి సం బంధించి ఎలాంటి సమస్యలుంటే స్థానిక కౌన్సిలర్లను సంప్రదించాలన్నారు. గత ఏడాది కోట్ల మొక్కలు రాష్ట్రవ్యాప్తంగా నాటి సంరక్షిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది కూడా జిల్లాలో సుమారు కోటి మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చేందుకు హరితహారం పథకం ప్రారంభిం చామని అన్నారు. దీని విజయవంతానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడంతోనే నేడు రైతులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, దీనిని తగ్గించడానికే సీఎం కేసీఆర్ హరితహారం రూపొందించారన్నారు. వచ్చే ఏడాది మున్సిపల్ స్థలాలు, అటవీ ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని సూచించారు. హరితహారానికి ఎన్ని నిధులైనా కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పండ్ల జాతి మొక్కలు, పూలజాతి మొక్కలు అటవీ మొక్కలు పెంచుతున్నట్లు మంత్రి వివరించారు. జాతీయ రహదారులు, చేలగట్లు, చెరువుల గట్లపై మొక్కలు భారీగా నాటాలని, వాటి సంరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచే ఆయా శాఖల ఆధ్వర్యంలో నాటే మొక్కల వివరాలు తెప్పించుకోవాలని, అందుకు అనుగుణంగా వారికి కావాల్సిన మొక్కలను పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.

శరవేగంగా యాదాద్రి విస్తరణ పనులు

త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు
యాడా ప్రత్యేకాధికారి కిషన్ రావు

యాదాద్రి భువనగిరి,మార్చి 19(ఆర్ ఎన్ఎ): యాదాద్రి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని యాడా ప్రత్యేకాధికారి కిషన్ రావు అన్నారు. ఆలస్యం అయినా పనులు పక్కాగా సాగుతున్నాయని అన్నారు. దీని నిర్మాణం పూర్తయితే ఇది ప్రపంచంలోనే అద్భుత ఆలయంగా నిలిచిపోతుందని అన్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు చినజీయర్ సమి సూచనల మేరకు నిర్మాణ పనులు సాగుతున్నాయని అన్నారు. యాదాద్రిని దివ్యమనోహర క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమం చేశారు. యాదగిరిగుట్టను మరో తిరుమలగా మారుస్తానని చెప్పింది మొదలు ఇప్పటికే పదిసార్లు యాదాద్రిని సందర్శించి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దివ్యమనోహరంగా తీర్చిదిదాలన్న సీఎం కేసీఆర్ ఆకాంక్ష మేరకు ప్రతి ఈ సారి బడ్జెట్‌లో భారీ పద్దును కేటాయించారు. దీంతో ఇక యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగిరం కానున్నాయి. దేశంలోనే అద్భుత ఆలయంగా తీర్చిదిద్దడానికి యాదాద్రి శ్రీలక్ష్మీనంసింహస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు ఈ ఏడాది దసరా వరకు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయింపులు చేస్తూ కొనసాగుతున్న ఆలయ అభివృద్ధి ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిధులు కేటాయి ంచారు. ఆలయ పునర్నిర్మాణ పను ల్లో ఏమాత్రం జాప్యం లేకుండా సమాంతరంగా చేపట్టాల్సిన పనులు పూర్తి చేస్తేనే ప్రధాన ఆలయం పనులతో పాటు కొండపై భక్తులకు కనీస సదుపాయాలు సమకూ రుతాయని భావిస్తున్నారు. ఇవికాకుండా మిషన్ కాకతీయ ద్వారా యాదాద్రి చుట్టువ కల్ల చెరువులను అభివృద్ధి చేశారు. మిషన్ భగీరథతో యాదాద్రికి మంచినీటి సౌకర్యం కల్పించే పనులు చేపట్టారు. గండిచెరువులో ఎప్పుడూ నీళ్లు ఉండేవిధంగా ఏర్పాటు చేశారు.

రైతులకు అండగా కేసీఆర్ సర్కార్

సమస్యలుంటే దృష్టికి తీసుకుని రండి: పద్మ

మెదక్,మార్చి19(నేటినిజం ప్రతినిధి): రైతులకు ఎలాంటి ఆపదలు, సమస్యలు ఎదురొచ్చినా పరిష్కారం కోసం అధికారులు, పాలకుల తమదృష్టికి తేవాలని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. రైతుకు ఇచ్చిన హామీ మేరకు రుణవిమోచన జరుగుబోతున్నదని అన్నారు. నేరుగా రైతులకే చెక్కులు అందచేస్తామన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమస్యలు పరిష్కారం చేసేందుకు ఎప్పుడు సిద్ధమేనని అన్నారు. రైతుల సంక్షేమాభివృద్ధికి సర్కారు ఎంతో కృషి చేస్తున్నదని చెప్పారు. రైతులు నష్టపోవద్దనే సదుద్దేశంతో పంటలకు నీరు వదులాలని నిర్ణయించామని అన్నారు. రైతులు తమ సమస్యలపై అధైర్య పడొద్దని ఆయన హితవు చేశారు.. రైతుల సంక్షేమం కోసం సర్కారు కొత్తగా ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు పరుస్తున్నట్లు చెప్పారు. రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర సర్కారు చిత్తశుద్ధితో పని చేస్తుందని, రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. రైతుల మేలు కోరి రైతు శ్రేయస్సు కోసం రాష్ట్ర సర్కారు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి, పంటల సాగు, వాటి అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే, కావాలనే రాజకీయ దురుద్దేశంతో కాంగ్రెస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి కోసమే మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. రైతులకు వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఎప్పుడు నమ్మొద్దని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం రైతులు బాగుంటనే దేశం సుభిక్షంగా ఉంటుందని, రైతులు సుఖః సంతోషాలతో ఉన్నప్పుడే ఆశించినంత ధాన్యం, పంటల దిగుబడి సమృద్ధిగా వస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా రైతుకు బీమా పథకాన్ని తెచ్చారని ఎమ్మెల్యే అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన రైతు బీమా పథకం ప్రపంచ చరిత్రలోనే తొలిసారిదని అన్నారు. రైతుకు ఏ కష్టం వచ్చినా తీర్చేందుకు ముందుంటున్నామని అన్నారు. రకరకాల ఇబ్బందులతో, పంటలపై పెట్టుబడులతో చేతిలో డబ్బులు లేని సందర్భంలో ఏదైనా కారణంతో రైతు మృతి చెందితే ఆ కుటుంబం నిరాధారమై పోతుందన్నారు. రైతు కోసం ఎన్నెన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్నారన్నారు. ఎకరానికి రూ. పదివేలు ఇవ్వడం రైతుబిడ్డగా కేసీఆర్ చేస్తున్న మంచి పనిగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

భారత ఆర్మీలో కరోనా కలకలం

-కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటన

న్యూఢిల్లీ,మార్చి18(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి నేపథ్యంలో భారతీయ ఆర్మీ అన్ని కమాండ్ సెంటర్లకు ఆదేశాలు జారీ చేసింది. యుద్ధ విన్యాసాలు, సమావేశాలను రద్దు చేయాలని ఇండియన్ ఆర్మీ కోరింది. శిక్షణా కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకోవాలని సూచించింది. అయితే పరిస్థితి మెరుగుపడే వరకు అవసరమైన వారికి మాత్రమే లీవ్‌లు ఇవ్వాలని ఆర్మీ ఓ ప్రకటనలో చెప్పింది. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న సైనికులు సమీప మిలిటరీ హాస్పటల్‌కు వెళ్లాలని సూచించింది. లేహ్‌కు చెందిన ఓ జవానుకు కరోనా పాజిటివ్ తేలింది. ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి ఒకటవ తేదీ వరకు లీవ్‌లో ఉన్న ఆ జవాను 2వ తేదీన విధుల్లో చేరాడు. అతని తండ్రి ఇరాన్ నుంచి యాత్ర ముగించుకుని వచ్చాడు. బహుశా అతని తండ్రి నుంచి వైరస్ సోకినట్లు అనుమానిస్తున్నారు.భారత ఆర్మీలో తొలి కరోనా కేసు నమోదైన నేపథ్యంలో ఆర్మీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అన్ని కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. వార్ గేమ్స్, కాన్ఫరెన్సులను వాయిదా వేసుకోవాలని అన్ని కామెండ్లకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు అందే వరకూ ఈ వాయిదా కొనసాగుతుందని తెలిపింది. వీటితో పాటూ ట్రైనింగ్ కార్యక్రమాలు కూడా వాయిదా పడ్డాయి. కాగా.. ప్రస్తుతం భారత్‌లో కరోనా బాధితుల సంఖ్య 150కి చేరుకుంది. పశ్చిమ బెంగాల్లో తొలి కరోనా కేసు నమోదైంది. మహారాష్ట్రలో అత్యధికంగా 42 కేసులు, కేరళలో 27, యూపీలో 16, హరియాణాలో 16, కర్ణాటకలో 11, ఢిల్లీలో 10, లద్దాఖ్‌లో 8 కేసులు చొప్పున నమోదయ్యాయి. ఇక ప్రపంచ వ్యాప్తంగా 1,99,180 కరోనా బాధితులు ఉండగా 7,993 మంది ఈ మహమ్మారికి బలయ్యారు..

విదేశీ విమానాలు రద్దు చేయండి

-కేంద్రానికి మంత్రి ఈటల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి19 (ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో, హైదరాబాద్‌కు వచ్చే విదేశీ విమానాలను పూర్తిగా రద్దు చేయాల్సిందిగా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్ష వర్ధన్‌కు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారానే కోవిడ్-19 వ్యాప్తి చెందుతున్నట్లు స్పష్టమైన సమాచారం ఉందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థానికంగా కరోనా వైరస్ లేదన్నారు. కావున, కరోనా వ్యాప్తి నివారణకు విదేశాల నుంచి ప్రయాణీకులను నిలువరించాల్సిందిగా పేర్కొన్నారు. గత కొన్ని వారాలుగా కోవిడ్-19 బాధిత దేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే విదేశీ ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. కరోనాను అడ్డుకునేందేకు చేపట్టని చర్యల్లో భాగంగా సచివాలయం సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సందర్శకులను నిలిపివేసింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో కరోనా వ్యాప్తి నివారణ, చికిత్సపై మంత్రి ఈటల అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. భేటీకి సీఎస్, డీజీపీ, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ అధికారులు

కరోనా వైరస్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి

- పోలీస్ కమిషనర్ డి.జోయల్ డేవిస్

సిద్దిపేట,మార్చి19(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న కరోనా వైరస్ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డి.జోయల్ డేవిస్ తెలిపారు. కరోనా వ్యాధి గురించి పోలీసు అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజలకు ఆయన సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు.

విదేశాల నుంచి వచ్చిన వ్యక్తుల దగ్గరికి వెళ్లే సమయంలో మాస్కులు ధరించాలనీ, శానిటైజర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ ముందు భాగంలో నీళ్లు, హ్యాండ్‌వాష్ సబ్బులు, శానిటైజర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

శ్వాసకోశ వ్యాధులున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కరోనా వ్యాధి ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. బ్లూ కోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది, రిసెప్షన్, లా అండ్ ఆర్డర్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ప్రజల్లోకి వెళ్లేటప్పుడు తప్పకుండా మాస్కులు ధరించాలని సీపీ సూచించారు.

ప్రతి పోలీస్ స్టేషన్‌లో టెంపరేచర్ ఎలక్ట్రానిక్ మిషన్, మాస్కులు, హ్యాండ్ శానిటైజర్లు వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్ డివిజన్ స్థాయిలో ఆర్డీవో, ఏసీపీ, మెడికల్ ఆఫీసర్.. కరోనా వ్యాధి నివారణ నోడల్ అధికారులుగా పనిచేస్తున్నారని సీపీ తెలిపారు. మండల స్థాయిలో ఎమ్మార్వో, ఎంపీడీవో, సీఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దిపేటలో ఉన్న మెడికల్ షాప్స్, మెడికల్ ఏజెన్సీలకు సంబంధిత సీఐలు, ఎస్ఐలు రెండు రోజుల క్రితం నుంచే అవగాహన కల్పించారనీ, మాస్కులు, శానిటైజర్లు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

సోషల్ మీడియాలో కరోనా వ్యాధిపై తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని ఈ సందర్భంగా సీపీ సూచించారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారం పంపిస్తే.. ఆ వ్యక్తిపై, సదరు గ్రూపు అడ్మిన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కరోనా వ్యాధి గురించి ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కాకూడదని, వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే, ఇంటిని వదిలి బయటకు రావొద్దని.. వారిని సిబ్బంది సాయంతో తక్షణమే ఐసోలేషన్ సెంటర్లకు పంపిస్తామని ఆయన వివరించారు.

బయటకు వెళ్లేటప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరితోనూ దగ్గరగా ఉండి మాట్లాడకూడదని, కరచాలనం చేయకూడదని ఈ సందర్భంగా సీపీ జోయల్ సూచించారు. సెల్ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కుమార్ క్యూరేటివ్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ,మార్చి19(ఆర్ఎన్ఎ): నిర్భయదోషి పవన్ కుమార్ గుప్తా క్యూరేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. అత్యాచార ఘటన జరిగిన సమయంలో తాను మైనర్ అని ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని మరణశిక్షను జీవితఖైదుగా మార్చాలని పవన్ గుప్తా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఇప్పటికే రెండు సార్లు క్యూరేటివ్ పిటిషన్ కొట్టివేసినప్పటికి పవన్ మరోసారి సుప్రీంలో పిటిషన్ వేశాడు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం పిటిషన్ కొట్టేసింది. అటు ఢిల్లీకోర్టు ఇచ్చిన డెత్ వారెంట్ ప్రకారం శుక్రవారం ఉదయం 5:30నిమిషాలకు తీహార్ జైల్లో నిర్భయదోషులకు ఉరిశిక్ష అమలుచేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాజాగా వెలువడిన తీర్పు పట్ల నిర్భయ తల్లి ఆశాదేవి మాట్లాడుతూ సుప్రీంకోర్టు వారికి చాలా అవకాశాలు ఇచ్చింది. ఉరిశిక్ష అమలు చేయకుండా కోర్టును ఆశ్రయించడం వారికి అలవాటు మారింది. నిందితులు వేస్తున్న వ్యూహాల గురించి న్యాయస్థానాలు అర్థం చేసుకుంటాయి. నిర్భయకు రేపు న్యాయం జరుగుతుందని ఆశాదేవి అన్నారు.

ఆంక్షల విధింపుతో నిర్మానుష్యంగా మారిన కలెక్టరేట్ పరిసరాలు

గిరిజన బాలికకు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత భరోసా

నిజామాబాద్, మార్చి 19: ఆరోగ్య సమస్యలతో కంటిచూపు మందగించిన గిరిజన బాలికకు మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత భరోసా ఇచ్చారు. ఆర్మూరు నియోజకవర్గం మాక్లూరుకు చెందిన నందిని చదువులో టాపర్. మాక్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చదువులో ముందుండంతో పాటు మంచి పెయింటర్. అయితే షుగర్, థైరాయిడ్‌తో బాధపడుతున్న నందినికి కంటిచూపు క్రమంగా మందగిచింది. నిత్యం ఇన్సులిన్ ఇంజక్షన్‌తో కాలం వెళ్లదీస్తుంది. తండ్రి చిన్నప్పుడే మరణిచం డం, తల్లి మానసిక వ్యాధితో మంచం పట్టడం ఇటు తనకు వ్యాధి తీవ్రత రోజు రోజుకు పెరుగుతూ ఆరోగ్యం క్షీణిస్తుండటం తో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విషయం తెలుసుకున్న కవిత బాలికకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. నందినికి మెరుగైన చికిత్స అందించేందుకు సిద్ధమయ్యారు. బాలికను హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయించారు. కంటి చికిత్స పూర్తవడంతో నందిని ఆరోగ్యం కుదుటపడింది. పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్తున్న నందిని నేడు కవితను కలిశారు. నందినికి ఎప్పుడు ఎలాంటి ఇబ్బంది వచ్చినా తనకు సమా చారం అందించాలని ఉపాధ్యాయు లు, బాలిక బంధువులకు సూచించింది. పరీక్ష లు రాసేందుకు వెళుతున్న బాలికకు అభిన ందనలు తెలిపి ఉత్సాహాన్ని నింపారు. నం దిని బొమ్మలు గీసే నైపుణ్యాన్ని మెచ్చుకున్నారు.

ఈతకు వెళ్ళిన ఇద్దరు యువకుల గల్లంతు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి19 (ఆర్ఎన్ఎ): సరదాగా ఈత కోసం వెళ్లిన ఇద్దరు యువకులు నీటిలో గల్లంతయ్యారు. ఈ ఘటన దుమ్ముగూడెం మండలం, దంతెనం గ్రామంలో చోటుచేసుకుంది. స్నానానికి వెళ్లిన ఇద్దరు యువకులు గోదావరి నదిలో గల్లంతయ్యారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లను రప్పించి.. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఇంకా యువకుల జాడ కానరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఛత్తీస్‌ఘడ్ కాల్పుల్లో ఒకరు మృతి

రాయ్‌పూర్,మార్చి19(ఆర్ఎన్ఎ):దంతెవాడ జిల్లా కిరందూల్‌లో ఇవాళ ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఉదయం 7 గంటల సమయంలో సీఆర్పీఎఫ్ బలగాలు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ పోలీసులు కలిసి కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఈ ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు దంతెవాడ ఎస్పీ అభిషేక్ పల్లవ్ వెల్లడించారు.

విశాఖపట్నంలో సంఘావరోధ స్థలాన్ని ఏర్పాటు చేసిన భారతీయ నౌకాదళం

హైదరాబాద్, మార్చి 19: సిఒవిఐడి-19 (కోవిడ్-19) వ్యాప్తి చెందకుండా దాని పై దేశం లో చేపట్టిన నిరోధక చర్యల ను బలపరచడం లో భాగం గా భారతీయ నౌకాదళం విశాఖపట్నం లోని ఈస్టర్న్ నేవల్ కమాండ్ (ఇఎన్‌సి)పరిధి లో ఉన్నటువంటి ఐఎన్ఎస్ విశ్వకర్మ లో ఒక సంఘావరోధ శిబిరాన్ని (క్వోరన్టీన్ క్యాంపు ను) ఏర్పాటు చేసింది. ఈ శిబిరాన్నికోవిడ్-19 బాధిత దేశాల నుండి ఖాళీ చేయిస్తున్న భారత జాతీయుల కోసం ఏర్పాటు చేయడమైంది.

ఈ సంఘావరోధ శిబిరం లో సుమారు 200 మంది కి తగ్గ సకల సదుపాయాలతోను, ఏర్పాట్లతోను ఆశ్రయాన్నిచ్చే విధం గా పూర్తి స్థాయి హంగుల ను సమకూర్చడం జరిగింది.

ఈ శిబిరం లో వసతి ని పొందే వ్యక్తుల ను నిశితం గా పర్యవేక్షించనున్నారు.

భారత ప్రభుత్వ ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ విభాగం నిర్దేశించిన ప్రోటోకాల్స్ కు అనుగుణం గా ఇఎన్‌సి యొక్క వైద్య వృత్తి నిపుణులు మరియు నౌకాదళ సిబ్బంది తో కూడిన ఒక బృందం వీరి పట్ల శ్రద్ధ వహిస్తుంది. ఒక ముందు జాగ్రత్త చర్య లో భాగం గా, నిర్వాసిత వ్యక్తుల ను పద్నాలుగు రోజుల పాటు సాటి సమాజం తో కలవనీయకుండా విడి గా ఉంచుతారు. వైరస్ వ్యాప్తి ని నివారించడం కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య సంబంధ అధికారుల తో, జిల్లా పాలన యంత్రాంగం తో ఇఎన్ సి క్రియాశీల సహకారాన్ని అందిస్తోంది.

కాంగ్రెస్, బీజేపీ ఆఫీసుల వద్ద భారీ భద్రత

భోపాల్, మార్చి 19: మధ్యప్రదేశ్‌లో కొన్ని రోజులుగా అనూహ్య రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. సీఎం కమల్‌నాథ్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దింపాలని బీజేపీ ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో..బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. రమాడా హోటల్‌లో ఉన్న 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలవాలంటూ ఇప్పటికే దిగ్విజయ్‌సింగ్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు బీజేపీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు.బీజేపీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్ కార్యకర్తలను ప్రతిఘటించేందుకు ఆందోళనలు చేపట్టారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో మధ్యప్రదేశ్‌లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఉన్న పోలీసులతోపాటు మరో 200 మంది పోలీసులతో రెండు పార్టీల కార్యాలయాల వద్ద భద్రత ఏర్పాటు చేసినట్లు భోపాల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసులు ఇర్షద్‌బాలి తెలిపారు.

కరోనాపై పోలీస్ శాఖ అప్రమత్తం

అన్ని జిల్లాల కమిషనర్లు, ఎస్పీలతో డీజీపీ భేటీ

నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసుల సూచనలు

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వ్యాప్తిని నివారించడానికి తెలంగాణ పోలీస్ శాఖ అప్రమత్తం అయ్యింది. అన్ని జిల్లాల కమిషనర్లు,ఎస్పీలతో గురువారం తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డి భేటీ అయ్యారు. బుధవారం ఒక్కరోజే 8 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 13కు చేరింది. రాష్ట్రంలో కలకలం సృష్టిస్తున్న కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోనా వైరస్‌పై అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా స్థానిక పోలీసులు చర్యలు చేపట్టాలని.. సభలు, సమావేశాలు, వివాహాలకు పోలీసులు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నారు. నేడు సాయంత్రం ముఖ్యమంత్రి భేటీలో పోలీస్‌శాఖ తీసుకున్న నిర్ణయాలను చర్చించనున్నారు. విదేశాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మరోవైపు రోనా వైరస్‌పై తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్న నగర వాసులకు అవగాహన కల్పించంలో ట్రాఫిక్ పోలీసులు తమ పాత్ర పోషిస్తున్నారు. నగరంలోని అమీర్‌పేట, బేగంపేట, లక్డీకాపూల్ తదితర ప్రధాన ప్రాంతాల్లోని సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్‌పోలీసులు కొద్దిసేపు వాహన దారులను నిలిపి కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకించి వ్యక్తిగత పరిశుభ్రత ఎలాపాటించాలన్నవిషయంపై వారు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఎప్పటికప్పుడు చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలన్న విషయం పై ట్రాఫిక్ పోలీసులు వారికి ప్రదర్శించి చూపిస్తున్నారు. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని వాహన దారులు చెబుతున్నారు. చాలా మంది కరోనా వైరస్ తమకేం వస్తుందిలే అన్న నిర్లక్ష్యం వహిస్తున్నారని, కానీ ట్రాఫిక్ పోలీసులు కల్పిస్తున్న అవగహన ఎంతో ఉపయోగకరంగా ఉందని లక్డికాపూల్‌లోని ఓ వాహన దారుడు అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత పరి శుభ్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండేందుకు ట్రాఫిక్‌పోలీసులుచేస్తున్న కృషికి నగర వాసుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

కరోనాకు అప్రమత్తతే అసలు మందు

జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

కామారెడ్డి,మార్చి19(ఆర్ఎన్ఎ): కరోనా వైర్‌సకు వ్యాక్సిన్ లేనందున అవగహన ఒక్కటే నివారణకు మార్గం అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్నారు. కరోనా వ్యాధికి ఇంకా వ్యాక్సిన్ అందుబాటులోకి రాలేదని దీనిపై ప్రజలకు అవగహన కల్పించి వారిని వైర్‌సబారిన పడకుండా కాపాడాలన్నారు. ప్రజలు కరోనాపై అపోహలతో భయభ్రాంతులకు గురికావొద్దాన్నారు. మనిషికి మనిషికి మధ్యదూరం కనీనం మీటర్ ఉండాలన్నారు.కరోనా బాధితులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, తుంపర్ల ద్వారా కరోనా వ్యాప్తి చెందుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో తిరిగేటప్పుడు అందరూ నోటికి, ముక్కుకు అడ్డంగా మాస్క్‌లు ధరించాలన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఒక చోటికి చేరవద్దన్నారు. చేతులను తరుచు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, వృద్ధులు వైర్‌సబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చలి ప్రదేశాల్లో తిరగకుడదన్నారు. ఆశ కార్యర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే చేసి విదేశాల నుంచి వచ్చిన వారి వివరాలు సేకరించాలన్నారు. విదేశాల నుంచి వచ్చిన వారిని 14 రోజు ల వరకు ఇంటికే పరిమితం చేయాలన్నారు. ప్రతీ ఆరోగ్యకేంద్రంలో 20 బెడ్లతో ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్ విండోను ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య సలహాల కోసం 104 ఉచిత హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

ఈనోవాను ఢీకొన్న టెంపో: ఒకరు మృతి

ఏలూరు,మార్చి19(ఆర్ఎన్ఎ): ఇన్నోవా కారును టెంపో వ్యాన్ ఢీకొ న్న ఘటన గురువారం ఉదయం ఏలూరు మినీ బైపాస్ పై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు మినీ బైపాస్ పై వెళుతున్న ఇన్నోవా కారును, టెంపో వ్యాన్ ఢీకొం ది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో లారీ, కారు రెండూ బోల్తాపడ్డాయి. ఘటనా స్థలానికి మూడో పట్టణ పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అటవీ అధికారి ఇంట్లో ఎసిబి దాడులు

తిరుపతి,మార్చి19(ఆర్ఎన్ఎ): అటవీశాఖ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇంట్లో ఏసీబీ అధికారులు దాడులు చేపట్టారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డిఎఫ్ఒ) వెంకటా చలపతి నాయుడు నివాసంలో ఉదయం నుంచి ఏసీబి దాడులు కొనసాగాయి. ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. అన్నారావు కూడలి సమీపంలోని మోర్ సూపర్ మార్కెట్ వెనుకవైపు ఉన్న ఎం 2 గ్రాండ్ హోటల్ నాలుగో అంతస్థులో ఉన్న చలపతి నాయుడు నివాసంలో ఎసిబి తనిఖీలు కొనసాగుతున్నాయి. తిరుపతితోపాటు కడప జిల్లా రాయచోటి, చిత్తూరు, బెంగళూరు ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. సోదాల్లో పలు దస్త్రాలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

కరోనా కంటే డేంజర్.!

నగరంలో నకిలీ శానిటైజర్ స్వాధీనం

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా కలకలం రేపుతున్న సంగతి తెలిసిందే. కరోనా కారణంగా మాస్క్‌లు, శానిటైజర్లకు విపరీతంగా డిమాండ్ పెరిగిపోయింది. ఈ క్రమంలోనే కొందరు కేటుగాళ్లు అక్రమ దందాకు తెరలేపారు. అసలు శానిటైజర్ల స్థానంలో కొంత మంది నకిలీ శానిటైజర్లు తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

రాచకొండ ఎస్ఓటీ పోలీసులు, తెలంగాణ ఆయుష్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జరిపిన సోదాల్లో డూప్లికేట్ హ్యాండ్ శానిటైజర్ తయారీ ముఠాగుట్టు రట్టు చేశారు. లక్షల విలువ చేసే నకిలీ శానిటైజర్, ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చర్లపల్లి ప్రాంతంలో అనుమతి లేకుండా రసాయనాలు తయారు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఓ ఇంట్లో నకిలీ శానిటైజర్ల తయారీ కోసం సిద్ధం చేసిన రసాయనాలు ఉన్నట్టు గుర్తించారు. వాటిని, అట్టపెఁటటెలో నింపి పంపిణీకి సిద్ధంగా ఉన్ననకిలీ శానిటైజర్లను స్వాధీనం చేసుకున్నారు. 100మి.లీ శానిటైజర్ల 25 వేల యూనిట్లు, ఫేస్ మాస్క్‌లు, రూ. 40 లక్షల విలువైన ముడి పదార్థాలను సీజ్ చేశారు. నకిలీ ఉత్పత్తుల తయారీలో పాల్గొన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు నిందితులు దాదాపుగా కోటిన్నర విలువ చేసే లక్ష వరకు నకిలీ శానిటైజర్ బాటిళ్లను తయారు చేసి విక్రయించినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇదిలా ఉంటే, మరోవైపు రాచకొండలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా, రూ. 10 లక్షల విలువైన 2,500 నకిలీ శానిటైజర్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. నిందితులు 2018లో ఆయుష్ సాఫ్ట్‌గెల్ క్యాపూల్స్/సిరప్స్ పేరుతో లైసెన్స్ తీసుకుని, హైదరాబాద్ పారిశ్రామిక

ప్రాంతంలో ఓ కర్మాగారాన్ని స్థాపించారు. ఆయుష్ సాఫ్ట్‌గెల్ క్యాపూల్స్, సిరప్‌లను తయారు చేయడం ప్రారంభించినట్లుగా అధికారులు గుర్తించారు. ఇలాంటి నకిలీ శానిటైజర్లు మార్కెట్‌లో కొంటే మోసపోక తప్పదని హెచ్చరిస్తున్నారు. నకిలీ ఉత్పత్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

కరోనాపై అప్రమత్తం అయిన జిల్లా వైద్యశాఖ

ఈటెల ఆదేశాలతో ఎప్పటికప్పుడు చర్యలు

నల్లగొండ,మార్చి19(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌పై తెలంగాణ ప్రభుత్వం యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో ఆ దిశగా వైద్యఆరోగ్య శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. వ్యాధి నివారణను దృష్టిలో పెట్టుకుని అనుమానితులను గుర్తించి భయాన్ని పోగొట్టేందుకు ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కొవిడ్-19 వ్యాప్తి నిరోధానికి నిధులు కేటాయించడంతో ఏర్పాట్లు జరుగు తున్నాయి.

జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడ, దేవరకొండ, సాగర్ ఏరియా దవాఖానాలతో పాటు నార్కట్‌పల్లిలోని కామినేని దవాఖానలోనూ ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదించి ఆరా తీస్తున్నారు. కరోనా కేసులు హైదరాబాద్‌లో గుర్తించింది మొదలు మంత్రి ఈటెల రాజేందర్ ఆదేశాల మేరకు జిల్లాలోనూ వైద్య శాఖ అప్రమత్తమైంది. జిల్లా కేంద్రంలో మెడికల్ అండ్ వైద్య విధాన పరిషత్ ఆద్వర్యంలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి ఐసోలేషన్ వార్డుగా రూపొందించి 20 బెడ్లు సమకూర్చారు. ఇందులో జనరల్ మెడిసిన్ డాక్టర్‌తో పాటు అనస్తీషియా, నోడల్ ఆఫీసర్, సూపరింటెండెంట్, ఫిజీషియన్‌లతో పాటు ఇతర సిబ్బంది ఉన్నారు.

నెల రోజుల ముందే జిల్లా కేంద్రంలోనూ తాత్కాలిక ఐసోలేషన్ వార్డులో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ ప్రస్తుతం వైద్యుల కేటాయింపు సైతం చేపట్టి వారిని అప్రమత్తంగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అదే విధంగా నార్కట్‌పల్లిలోని కామినేని దవాఖానలోనూ 50 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. నల్లగొండ, నార్కట్‌పల్లిలో వైద్య కళాశాలలు ఉండటంతో వైద్య విద్యార్థుల సహకారంతో అనుమానితులను పర్యవేక్షించనున్నారు. నల్లగొండలో 20 బెడ్లతో, నార్కట్‌పల్లి కామినేనిలో 50 బెడ్లతో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసింది.వ్యాధి అనుమానితులు దవాఖానకు వస్తే వెంటనే శాంపిల్స్ తీసుకుని హైదరాబాద్‌కు పంపించేలా ఏర్పాట్లు చేశారు.

విదేశాల్లోఉన్న భారతీయులను రప్పించండి

ట్వీట్ చేసిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,మార్చి19(ఆర్ఎన్ఎ): ప్రపంచ దేశాల్లో కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో అన్ని దేశాలు అప్రమత్తపయ్యాయి. ఈ నేపథ్యంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేశారు. విదేశాల్లోని భారతీయులంతా విమానాశ్రయాల్లోనే ఉండిపోయినట్లు సమాచారం అందుతోందని కేటీఆర్ తెలిపారు. మనీలా, రోమ్, సింగపూర్, కౌలాలంపూర్ విమానాశ్రయాల్లో ఉన్నట్లు సందేశాలు వచ్చాయి. వారందరినీ స్వస్థలాలకు పంపించేలా ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ ప్రధాని మోదీకి వినతి చేశారు. ఇదిలావుంటే కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి నగరంలోకి వచ్చే రహదారుల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. థర్మల్ స్క్రీనింగ్‌తో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఎన్నారైలు ప్రశంసలు కురిపిస్తున్నారు. గత గురువారం లండన్ నుంచి హైదరాబాద్‌కు ఎన్ఆర్ఐ రోహిత్ పోతుకూచి వచ్చారు. ప్రభుత్వ పనితీరును మెచ్చుకుంటూ రోహిత్ సోషల్ మీడియాలో సందేశం పంపారు. లండన్ నుంచి ఆర్జీఐ ఎయిర్‌పోర్టులో దిగగానే థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఆ తర్వాత తన ఇంటి అడ్రస్ తెలుసుకుని స్వయంగా జీహెచ్ఎంసీ అధికారులు, వైద్య బృందం వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం తనకు కరోనా లక్షణాలు లేవని వైద్యులు తేల్చారు అని రోహిత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై రోహిత్ ప్రశంసలు కురిపించారు.

సిఒవిఐడి-19 వైరస్ ముందు జాగ్రత్త చర్యగా మేఘాలయ ప్రభుత్వం

మార్చి 31 వరకు రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రదేశాలను మూసివేస్తుంది

న్యూ ఢిల్లీ, మార్చి 19:సిఒవిఐడి-19 వైరస్ ముందు జాగ్రత్త చర్యగా మేఘాలయ ప్రభుత్వం 2020 మార్చి 31 వరకు మేఘాలయ రాష్ట్రం లోని అన్ని పర్యాటక ప్రదేశాలను మూసివేసింది. ఈ అంక్షలు ఏప్రిల్ 15, 2020 వరకు పొడిగించే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. షిల్లాంగ్ మరియు మేఘాలయ లోని ఇతర ప్రదేశాలను సందర్శించాలనుకునే పర్యాటకులందరినీ వారి ప్రయాణ ప్రణాళికలను తదనుగుణంగా తిరిగి షెడ్యూల్ చేసుకోవాల్సిందిగా రాష్ట్రం ప్రబుత్వం సూచించింది.

బిజెపి బలోపేతానికి కృషి చేస్తా

-జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

వరంగల్‌రూరల్,మార్చి19(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో బీజేపీకి కొత్త బలం చేకూరుతోందని,బండి సంజయ్ అధ్యక్షతన పార్టీని జిల్లాలో విస్తరిస్తామని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. తెలంగాణలో బీజేపీ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమవుతోందన్నారు. టీఆర్ఎస్ పాలనపై ప్రజలు విముఖత చూపుతున్నారని, రాబోయే రోజుల్లో రాంరాం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కుటుంబ పాలనపట్ల ప్రజల్లో తీవ్ర నిరాశ ఏర్పడిందన్నారు. సిఎఎపై అసెంబ్లీ తీర్మానంతో ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. రాజ్యాంగం గురించి సిఎం లాంటి వ్యక్తికి తెలియదా అని ప్రశ్నించారు. బీజేపీకి ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు. క్రమశిక్షణతో కూడిన పార్టీగా బీజేపీకి గుర్తింపు ఉ